ప్రజాశక్తి

గురువారం 16 అక్టోబర్ 2025 8 పేజీలు





గుంటూరు పల్నాడు

మిర్చిపై ఆచితూచి అడుగులు

50 శాతం విస్తీర్ణంలో సాగు - పెట్టుబడి పెరిగినా ధరలు లేకపోవడంతో రైతుల్లో నిరాశ

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

మిర్చి సాగులో గత సీజన్‌లో ఎదురైన ఇబ్బందులు దృష్ట్యా ఈ ఏడాది ఉమ్మడి గుంటూరు జిల్లాలో రైతులు ఆచితూచి అడుగేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ముగిసినా మిర్చి సాగుపై ఆసక్తి చూపడం లేదు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఏటా 1.60 లక్షల నుంచి 2 లక్షల ఎకరాల్లో మిర్చి సాగవుతుంది. అయితే ఈ ఏడాది ఇప్పటివరకు 80 వేల ఎకరాల్లోనే సాగైంది. 2019 నుంచి 2024 వరకు మిర్చి ధరలు ఆశ జనకంగా ఉండటంతో రైతులు ఉత్సాహంగా సాగు చేశారు. 2022లో తామర తెగులు తీవ్రంగా ఉండి ఎక్కువగా నష్టాలొచ్చినా 2023, 2024 సంవత్సరాల్లో సాగు విస్తీర్ణం తగ్గలేదు. ధరలు కూడా రైతులకు ఆశాజనకంగా లభించాయి. దాదాపు నాలుగేళ్ల పాటు మిర్చి కనీస ధర క్వింటాళ్ రూ.18 వేలు, గరిష్ట ధర రూ.27 వేల వరకు ఉంది. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు కనీస ధర రూ.9 వేలు, గరిష్ట ధర రూ.15 వేలకు మించలేదు. అంతేకాకుండా గతంలో కంటే పెట్టుబడులు భారీగా పెరిగాయి. ఎకరాకు



రూ.రెండున్నర లక్షల వరకు పెట్టుబడి పెడితే ఏడాది కనీస ధర రాలేదు. దీంతో రైతులు తీవ్ర నిరాశ గురయ్యారు.

గతేడాది పండిన మిర్చి ఇప్పటికీ కోల్డ్ స్టోరేజీల్లో నిల్వఉంది. ప్రస్తుతం కోల్డ్ స్టోరేజీల్లో సుమారు 51 లక్షల బస్తాల సరుకు నిల్వ ఉంది. గత సీజన్లో ఎగుమతులు లేవనే సాకుతో వ్యాపారులంతా సిండికేట్ అయ్యి ధరలు తగ్గించారనే విమర్శలున్నాయి. చైనా, వియత్నాం, బంగ్లాదేశ్, ఇండోనేషియా, థాయ్‌లాండ్, సింగపూర్, మలేషియా, శ్రీలంక మొదలగు దేశాలకు ఎగుమతులు ఆర్డర్లున్నా ఎగుమతులు లేవని, ఇంకా ఖరారు కాలేదంటూ ధరలను తగ్గించారు. ఆశించిన ధరలు రాకపోవడంతో రైతులు మిర్చి సాగుపై ఈసారి ఉత్సాహం చూపించటం లేదు. అయినా గత్యంతరం లేక మరో పంట వేయలేక ఇప్పటికే ఎక్కువ మంది రైతులు మిర్చి సాగుకు అనుకూలంగా స్పందిస్తున్నారు. విదేశాలకు ఆశించిన స్థాయిలో ఎగుమతులు లేవని, దేశీయ మార్కెట్‌లో స్థానిక మిర్చి ఎక్కువగా కొనుగోలు చేయడం వల్ల ధరలు పెరగడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. ఈ ఏడాది వేసవి సెలవుల తర్వాత ధరలు స్వల్పంగా పెరుగుతున్నాయని రైతులు తెలిపారు. క్వింటాళ్ రూ.1000 నుండి రూ.1500 వరకు పెరుగుదల ఉందని చెప్పారు. ప్రస్తుతము గుంటూరు మిర్చి యార్డుకు రోజుకు సగటున 55 వేల టిక్కీల వరకు అమ్మకానికి మిర్చి వస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మరో 15 రోజులు వరకు మిర్చి సాగు ఒక అవకాశం ఉందని, మరికొంత విస్తీర్ణం పెరగవచ్చునని అధికారుల అంచనా వేస్తున్నారు.



మంగళగిరి ప్రాంతంలోని హాస్టల్స్ ఫొటోలను ప్రదర్శిస్తున్న నాయకులు

హాస్టల్స్‌లో సమస్యలను పరిష్కరించాలి

- రాజధాని ప్రాంతంలోనూ అధ్వాన్నంగా ప్రభుత్వ వసతి గృహాలు
- సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ

ప్రజాశక్తి-గుంటూరు

పేద విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బిసి సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాని సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ కోరారు. బ్రాడిపేటలోని సిపిఎం కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పేద విద్యార్థులు చదువుతున్న ఈ హాస్టల్స్‌లో పెద్ద ఎత్తున సమస్యలు తిష్ట వేశాయని, తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నాయని అన్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యలు పరిష్కారం కావట్లేదన్నారు. దీనికి అనపర్రు హాస్టల్ సంఘటన నిదర్శనమన్నారు. రాజధాని ప్రాంతానికి ప్రాధాన్యత ఇస్తున్నామని గొప్పగా చెప్పుకుంటున్న ప్రభుత్వం అదే ప్రాంతంలోని మంగళగిరి కార్పొరేషన్‌లో, విద్యాశాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో హాస్టల్స్ అధ్వాన్నంగా ఉన్నాయన్నారు. హైవేకి పక్కన వున్న ఎస్సీ బాలుర హాస్టల్‌లో బాత్‌రూమ్‌లు, లెట్రిన్‌ల పరిస్థితి అత్యంత ఘోరంగా వుందన్నారు. బాత్రూంలు వినియోగించే పరిస్థితి లేక విద్యార్థులు ఆరుబయటే స్థానాలు చేస్తున్నారని, రెండు లెట్రిన్‌లు మాత్రమే వినియోగంలో వుండగా వాటిని కూడా శుభ్రం చేయట్లేదని వివరించారు. మంత్రి నియోజకవర్గంలోనే పరిస్థితి ఈ విధంగా ఉంటే జిల్లా మొత్తంగా ఎలా ఉందో అర్థం అవుతుందన్నారు. జిల్లాలో పలు హాస్టల్స్‌లో పారిశుధ్యం సమస్య తీవ్రంగా వుందని, తాగునీటి సరఫరా సక్రమంగా లేదని అన్నారు. పిల్లలకు 5 ఏళ్ళ క్రితం ఇచ్చిన ట్రంకు పెట్టెలు ▶ 2లో

ఆర్మీ మేజర్ భరద్వాజకు ఘన నివాళులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి



రాజస్థాన్‌లోని సైనిక శిబిరంలో యుద్ధ విన్యాసాలు చేస్తుండగా జరిగిన ప్రమాదంలో వీరమరణం పొందిన మేజర్ టిఎస్‌టి భరద్వాజ్ పార్థివదేహానికి బుధవారం అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి. జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీయా, ఎస్.పి. వకుల్ జిందాల్, ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, నజీర్ అహ్మద్, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, ఆర్డీవో శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు భరద్వాజ్ భౌతికకాయంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. పోలీస్ శాఖ తరపున గౌరవ వందనం సమర్పించి ఘన నివాళులు అర్పించారు. సంగడిగుంట నుంచి శ్మశాన వాటిక వరకు భౌతికకాయంతో ఊరేగింపు జరిగింది. భరద్వాజ్ తండ్రి ఉపేంద్ర కుమార్, కుటుంబ సభ్యులతో కలెక్టర్ మాట్లాడి, ధైర్యం చెప్పారు.



అదనపు కమిషనర్ భార్గవ్ తేజ్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

నేరాల నియంత్రణ, గంజాయి కట్టడి

- రౌడీ షీటర్ల ఆగడాలు అరికడతాం
- రాత్రిళ్లు తాగి తిరిగితే కేసులు
- తెనాలి పర్యటనలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



పోలీస్ స్టేషన్ల తనిఖీలో ఎస్పీ వసూల్ జిందాల్

ప్రజాశక్తి - తెనాలి

పట్టణంలో నేరాల నియంత్రణకు, గంజాయి కట్టడి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ స్పష్టం చేశారు. పట్టణంలో మంగళవారం పట్టపగలు నడిరోడ్డుపై ఓ వ్యక్తి హత్యకు గురైన నేపథ్యంలో ఎస్పీ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. వన్ టౌన్, 3 టౌన్, రూరల్ పోలీస్ స్టేషన్లను ఆయన తనిఖీ చేశారు. ఆయా స్టేషన్లో పరిధిలో రౌడీ షీటర్ల వివరాలు, వారి కౌన్సెలింగ్ విధానాన్ని డీఎస్పీ బి.జనార్ధనరావు ద్వారా తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తెనాలి పట్టణంలో రౌడీ షీటర్ల ఆగడాలను కట్టడి చేస్తామన్నారు. పదేపదే నేరాలకు పాల్పడితే వారిపై చర్యలు తీవ్రంగా ఉంటాయని, పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని చెప్పారు. గంజాయి విక్రయించేవారు, వినియోగించే వారిపై కూడా కేసులు నమోదు చేసి, వారికి శిక్షలు పడేలా చూస్తామన్నారు. మహిళల భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని, పాఠశాలలు, కళాశాలల వద్ద డ్రోన్ ▶ 2లో

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

విద్యార్థినితో అసభ్య ప్రవర్తనపై పల్నాడు డిఇఒ విచారణ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుణ్ణి విద్యాశాఖ అధికారులు సస్పెండ్ చేశారు. సత్తెనపల్లి మండలం ఫణిదం జెడ్‌పి పాఠశాలలో జీవశాస్త్రం ఉపాధ్యాయుడు జోర్డాన్ బాబు 10వ తరగతి విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో గ్రామస్తులు, బాలికల తల్లిదండ్రులు మంగళవారం దేహశుద్ధి చేశారు. దీనిపై గ్రామస్తుల ఫిర్యాదు నేపథ్యంలో పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి చంద్రకళ, సత్తెనపల్లి డివిజన్ ఉప ▶ 2లో



విచారణ చేస్తున్న పల్నాడు డిఇఒ చంద్రకళ

సిఅర్‌డిఎ అధికారులపై రైతుల ఆగ్రహం

- మందడంలో గ్రామసభ నుంచి వెళ్లిపోయిన రైతులు
- సభకు రాని కమిషనర్ కన్నబాబు

ప్రజాశక్తి - తుళ్లూరు

సిఆర్‌డిఎ అధికారుల వైఖరిపై రాజధాని రైతులు మండిపడ్డారు. నిర్ణీత సమయానికి కమిషనర్ కన్నబాబు రాకపోవడంతో మందడం రైతులు గ్రామసభను బాయ్‌కాట్ చేశారు. రెండ్రోజుల క్రితం గుంటూరులో రాజధాని రైతు జెఎసి సమావేశం జరిగింది. సమావేశంలో రైతులు తమ సమస్యలపై నిరసన గళం వినిపించారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు రాజధానిలో సిఆర్‌డిఎ కార్యాలయాన్ని ప్రారంభిస్తూ రైతులు సమస్యలను మంత్రి నారాయణ, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ పరిష్కరిస్తారని, అవసరం అనుకుంటే తానే చూసుకుంటానని చెప్పారు. ఈ నేపథ్యంలో సిఆర్‌డిఎ అధికారులు బుధవారం రాత్రి రాజధాని ప్రాంతం మందడంలోని సాయిలక్ష్మీ కృష్ణా కల్యాణ మండపంలో గ్రామసభ ఏర్పాటు చేశారు. ఆరు గంటలకు కమిషనర్ కన్నబాబు వస్తారని ప్రచారమవడంతో రైతులు పెద్ద సంఖ్యలో గ్రామసభకు వచ్చారు. కమిషనర్ రాత్రి 8 గంటలైనా రాకపోవడంతో అప్పటిదాకా ఎదురుచూసిన రైతులు తీవ్ర అసహనానికి గురయ్యారు. రైతుల పట్ల సిఆర్‌డిఎ అధికారులు చులకన భావంతో వ్యవహరిస్తున్నారని మండిపడి ▶ 2లో



నివాళి అర్పిస్తున్న కలెక్టర్, డిఆర్ఒ

అబ్దుల్ కలాం జీవితం స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి-గుంటూరు

మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంకు జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా నివాళులు అర్పించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద జిల్లా కలెక్టర్ జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్కె.ఖాజావలితో కలిసి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 'మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా కీర్తి గడించిన మహనీయులు ఏపీజే అబ్దుల్ కలాం అన్నారు. దేశంలో అత్యున్నతమైన రాష్ట్రపతి పదవికి వన్నె తీసుకొచ్చారని కొనియాడారు. సామాన్య కుటుంబం నుంచి దేశం గర్వించదగిన శాస్త్రవేత్తగా ఎదిగిన అబ్దుల్ కలాం తన ప్రసంగాలతో యువతలో స్ఫూర్తి నింపారని, ఆయన జయంతిని ప్రపంచ విద్యార్థుల దినోత్సవంగా జరుపుకోవడం మనందరికీ గర్వకారణం అని చెప్పారు. ఎందరికో ఆదర్శంగా నిలిచిన అబ్దుల్ కలాం సేవలను, ఆశయాలను స్మరించుకుంటూ ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో పూర్ణచంద్రరావు, సెక్షన్ సూపరింటెండెంట్‌లు మల్లేశ్వరి, కళ్యాణి ఉద్యోగులు పాల్గొన్నారు.

హెడ్ వాటర్ వర్క్స్‌ను తనిఖీ చేసిన కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరానికి త్రాగునీటిని అందించే హెడ్‌వాటర్ వర్క్స్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, సిబ్బంది మినహా ఇతరులను లోనికి రానివ్వద్దని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కమిషనర్ జిఎంసి హెడ్ వాటర్‌వర్క్స్, మానససరోవరం దగ్గర కల్వర్ట్, ఆర్టీసి కాలనీ, చిన్నేరుకుంట, కోబాల్ట్ పేటలో పీకలవాగు ఆక్రమణలను పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. సిసి కెమెరాలతో వాటర్ వర్క్స్ ప్రాంగణం పర్యవేక్షణ చేయాలని, కష్ణానది నుండి వచ్చే నీటిని నిర్దేశిత శాస్త్రీయ విధానంలో శుద్ధి చేసి, ల్యాబ్‌లో తనిఖీ చేసిన అనంతరమే సరఫరాకి పంపింగ్ చేయాలన్నారు.మానస సరోవరం వద్ద సర్వీస్ రోడ్ వెంబడి కల్వర్ట్ చిన్నదిగా ఉండడం వలన వర్షం నీరు రోడ్ మీదకు వస్తుందన్న ఫిర్యాదు మేరకు పరిశీలించి, నేషనల్ హైవే అథారిటీ అధికారులతో సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో డిఈఈ రమేష్‌బాబు, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణ, గంజాయి కట్టడి

(మొదటి పేజీ తరువాయి)

నిఘా ఉంటుందని, నిత్యం నిఘా ఉంచేందుకు శక్తి టీమ్స్ పనిచేస్తున్నాయని చెప్పారు. ఏవైనా అవాంఛనీయ ఘటనలు జరిగితే కేసులు నమోదు చేసి, 60 రోజులలో ఛార్జ్ షీట్ దాఖలు చేస్తామని, కఠిన శిక్షలు అమలయ్యేలా చర్యలు ఉంటాయని చెప్పారు. రాత్రి సమయాల్లో మద్యం సేవించి, అనవసరంగా తిరిగి, అల్లర్లు సృష్టించే వారిపై కేసులు నమోదు చేస్తామని, రాత్రి వేళలో పోలీస్ బీట్ పెంచుతామని అన్నారు. ఇటీవల సైబర్ నేరాలు కూడా పెరిగాయని, వివిధ రూపాల్లో బెదిరించి బ్యాంకు ఖాతాలోని సొమ్మును కాజేస్తున్నారని అన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇలాంటి సమస్య ఎదురైతే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1930కి సమాచారం ఇవ్వాలని, ఫలితంగా నగదు బదిలీ అయిన ఖాతాలను సీజ్ చేసి, బాధితులకు తిరిగి ఇప్పించే అవకాశం ఉంటుందని వివరించారు. ట్రాఫిక్ సమస్యను నియంత్రణకు చర్యలు తీసుకుంటామని, శిథిలావస్థలో ఉన్న పోలీస్ క్వార్టర్స్ విషయం ఉన్నతాధికారులకు నివేదించామని చెప్పారు. తెనాలి, పరిసర ప్రాంతాలు సురక్షితంగా ఉండేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ బి.జనార్ధనరావు, వన్ టౌన్ సిఐ మల్లికార్జునరావు, త్రీ టౌన్ సిఐ ఎస్ సాంబశివరావు, రూరల్ సిఐ ఆర్.ఉమేష్ సిబ్బంది ఉన్నారు.

సిఆర్‌డిఎ అధికారులపై రైతుల ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

గ్రామసభ నుంచి బయటకు వెళ్లిపోయారు. అధికారులు ఎంత వారించినా వినలేదు. మిగిలిన కొద్ది మంది రైతులు రోడ్డుపై నిలుచున్నారు. ఇంతలో సిఆర్‌డిఎ అదనపు కమిషనర్ భార్గవ్ తేజ్ గ్రామసభ దగ్గరకు వచ్చారు. తాము కొన్ని గంటలుగా ఎదురుచూస్తున్నామని, సమస్యలను చెప్పుకుందామంటే కమిషనర్ రాలేదని ఆయన ఎదుట రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ కంఠాలు, కౌలు చెల్లింపు, రిటర్నబుల్ ప్లాట్లుకు వీధి పోట్లు, ప్లాట్లు అభివృద్ధి తదితర సమస్యలు ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోలేదన్నారు. గ్రామ సభలో తమ గోడు చెప్పుకుందా మంటే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంత మేరకు సబబుని ప్రశ్నించారు. అధికారులు సమయపాలన పాటిస్తే ఇబ్బందులు ఉండవన్నారు. దీంతో భార్గవ్‌తేజ్ ఫోన్‌లో కమిషనర్‌తో మాట్లాడారు. కమిషనర్ వేరే సమావేశంలో ఉన్నారని, సభను జరుపుదామన్నా లేదంటే మరోసారి నిర్వహించుకుందామన్నా తనకు అభ్యంతరం లేదని రైతులతో చెప్పారు. రాజధాని రైతుల సమస్యలపై తనకు అవగాహన ఉందన్నారు. గ్రామసభ వేదిక ముందు కూర్చొని రైతుల సమస్యలను విన్నారు. మరోసారి గ్రామసభ జరుదామని చెప్పి వెళ్లిపోయారు.



రైతులు వెళ్లిపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

(మొదటి పేజీ తరువాయి)

విద్యాశాఖ అధికారి ఏసుబాబు పాఠశాలను సందర్శించి విచారణ చేపట్టారు. బాలికలతో, తల్లిదండ్రులతో, ఉపాధ్యాయులతో విడివిడిగా మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం ఉపాధ్యాయుడు జోర్డాన్‌బాబును సస్పెండ్ చేస్తూ డిఇఒ ఉత్తర్వులిచ్చారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించి పలు వివరాలు అడిగారు. డిఇఒ వెంట ఎంఇఒ ఎ.శ్రీనివాసరావు ఉన్నారు.

హాస్టల్స్‌లో సమస్యలను పరిష్కరించాలి

(మొదటి పేజీ తరువాయి)

పాడైపోయి, వాటికి తాళాలు కూడా లేవని, అందరికీ కొత్త పెట్టెలు ఇవ్వాలిని కోరారు. ముందుగా చెల్లించాల్సిన కాస్మోటిక్ ఛార్జీలు నెలలు గడిచినా చెల్లించట్లేదని తెలిపారు. తాగునీటి వసతి కోసం అన్ని హాస్టల్స్‌లో వాటర్ ఫిల్టర్లు ఏర్పాటు చేయాలని, లెట్రిన్, బాత్‌రూమ్స్ శుభ్రపరిచేందుకు ప్రత్యేకంగా వర్కర్లను ఏర్పాటు చేయాలని, ఖాళీపోస్టులను భర్తీ చేయాలని, దోమతెరలు అందరికీ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. మెనూ ఛార్జీలు కూడా ప్రతినెలా చెల్లించట్లేదని, ఇది విద్యార్థులకు అందించే ఆహారంపై కూడా ప్రభావం పడుతోందని చెప్పారు. ప్రభుత్వ భవనాల్లో మరమ్మతులు చేయించేందుకు యంత్రాంగం చురుకుగా స్పందించాలని కోరారు. మంత్రులు, ఎమ్మెల్యేలు అధికారులతో సమావేశాలకే పరిమితం కాకుండా నెలకు ఒక్కరోజైనా హాస్టల్స్‌ను వ్యక్తిగతంగా సందర్శించి సమస్యలు పరిష్కారం చేసేందుకు చొరవ ప్రదర్శించాలని కోరారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.భావన్నారాయణ, కె.నళినీకాంత్, నాయకులు కృష్ణకాంత్ పాల్గొన్నారు.

రేపటి ధర్నాకు తరలిరండి

ప్రజాశక్తి మంగళగిరి

ఈనెల 17వ తేదీన మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ఇళ్ల పట్టాలు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జరిగే ధర్నా కార్యక్రమానికి పేదల పెద్ద సంఖ్యలో తరలిరావాలని సిపిఎం సీనియర్ నాయకులు పి బాలకష్ణ అన్నారు. బుధవారం రాత్రి మంగళగిరి పట్టణంలోని రత్నాల చెరువులోని ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాల కొరకు దరఖాస్తులు పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేస్తున్నారు. ఇళ్ల స్థలాలు కోసం పేదలు పెద్ద ఎత్తున తరలివస్తానికి ఉత్సాహంగా ఉన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు ఎం చంద్రారావు పాల్గొన్నారు.

ఆరుగురు జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మండల పరిధిలోని పోతవరం గ్రామ పొలాల్లో బుధవారం నాడు రహస్యంగా పేకాట (కోత ముక్క) ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను రూరల్ ఎస్.ఐ. జి. అనిల్ కుమార్ మరియు వారి సిబ్బంది పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.5,100లు స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

రాజధాని నిర్మాణ కంపెనీలో ఐరన్ సామగ్రి చోరీ

ఐదుగురికి రిమాండ్

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

సిఆర్‌డిఏ పరిధిలోని కురగల్లు గ్రామ శివారులోని బిఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీకి సంబంధించిన 2లక్షల విలువగలిగిన భవన నిర్మాణ సామాగ్రి రూ. ఐదుగురు చోరులు అపహరించారు కంపెనీ యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్టు చేశారు. విజయవాడ ఇబ్రహీంపట్నం చెందిన చల్లా జగదీష్ మరియు మాత గణేష్, పైడిపాళ్ళ దుర్గారావు మరో ఇద్దరూ మొత్తం అయిదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. వారి నుంచి చోరీ సొత్తుని రికవరీ చేసి మంగళగిరి మెజిస్ట్రేట్ వారి ముందు హాజరపరచగా, న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై వెంకట్ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ప్రజాశక్తి - యడ్లపాడు



షేక్ జానీ

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బోయపాలెం మసీదు వెనుక వీధిలో నివాసం ఉండే వెల్డర్ షేక్ జానీకి 22 ఏళ్ల కిందట రేష్మాతో వివాహం అయింది. వీరికి ఇద్దరు కుమారులు. ఈనెల 7వ తేదీ వెనిగండ్ల గ్రామంలో ఓ శుభాకార్యానికి ద్విచక్ర వాహనంపై జానీ దంపతులు వెళ్లి వస్తుండగా గుంటూరు సమీపంలోని ఏటుకూరు రోడ్డు బైపాస్ వద్ద రాత్రి సుమారు 9 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో వాహనంపై ఉన్న దంపతులకు గాయాలయ్యాయి. తలకు తీవ్రంగా గాయాలైన జానీని గుంటూరులోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి జాని(45) మృతి చెందాడు. బుధవారం పోస్టు మార్టం అనంతరం మృతదేహాన్ని బోయపాలెం తీసుకురావడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

తల్లి మందలించిందని బాలిక ఆత్మహత్య

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

తల్లి మందలించడంతో మనస్థాపం చెందిన బాలిక ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన సత్తెన పల్లి మండలం అబ్బూరు గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బర్ల సోనాలి (15) తల్లి మంజుల కుమార్తె సోనాలీని మంగళవారం రాత్రి మందలించడంతో భోజనం చేయకుండా గదిలోకి వెళ్ళి తలుపు వేసు కుంది. తెల్లారి చూసే సరికి ఫ్యానుకు ఉరివేసుకుని మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తల్లి ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

నలుగురి బైండోవర్

ప్రజాశక్తి-ఈపూరు

ఈపూరు ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ మద్యం కేసులలో ఉన్న నలుగురిని బుధ వారం బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ డి.వెంక టేశ్వర్లు తెలిపారు. రొంపిచర్ల మండలంలోని ముత్తనపల్లి, అలవాల బుచ్చిపాపన్నవారి పాలెం, తుంగపాడు గ్రామాలకు చెందిన నలుగురిని రొంపిచర్ల తహశీల్దార్ ముందు హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు. నాటు సారాయి,అక్రమ మద్యం, మాదకద్రవ్యాల సమాచారం స్థానిక ఎక్సైజ్ పోలీసులకు తెలపాలని ఆయన కోరారు.

గోశాలను తరలించాలని ఆందోళన

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని ప్రాంతం అనంతవరంలో నిబంధనలు పాటించకుండా నిర్వహిస్తున్న గోశాల తరలింపుపై అధికారులు మీన మేషాలు లెక్కిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామస్తులు, హిందూ ధార్మిక సంఘాలు కొద్ది రోజుల కిందట స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి గోశాలను తరలించాలని అధికారులకు వినతిపత్రం అందజేశారు. పశు సంవర్ధక శాఖ అధికారులు సైతం అనుమతి పొందిన, సురక్షిత ప్రాంతానికి గోశాలను తరలించాలని నిర్వాహకులకు నోటీసులు ఇచ్చారు. అయినా అధికారుల నుంచి ఎలాంటి చర్యలు లేవు. దీంతో బుధవారం అనంతవరంలో గ్రామస్తులు, రైతులు ధర్నాకు దిగారు. మూగ జీవాలకు మేత, నీరు, సరైన సదుపాయాలు కల్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించి వాటి వృతికి కారణమైన నిర్వాహకులను అరెస్టు చేయాలంటూ నినాదాలు చేశారు. గోశాలను సురేష్ అనే వ్యక్తి సిఆర్‌డిఎ స్థలంలో అనుమతి లేకుండా గోసంరక్షణ పేరుతో నిర్వహిస్తున్నారు. సుమారు 350వరకు ఆవులు, ఎద్దులు, దూడలు గోశాలలో ఉండగా వాటికి మేత, తిండి, సరైన సదుపాయాలు కల్పించడం లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. తక్షణమే గోశాలను సురక్షిత ప్రాంతానికి తరలించాలని, లేనిపక్షంలో ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు.



అనంతవరంలో ధర్నా చేస్తున్న గ్రామస్తులు

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - విజయపురిసౌత్ (రెంటచింతల)

మండలంలోని గోలి గ్రామంలో జూద మాడు తున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఎచ్ఓ తిరుపాలునాయక్ చెప్పా రు. వారి నుంచి రూ.5040లు చేసుకున్నట్లు పేర్కొన్నారు.

జనావాసాల మధ్యకు కొండచిలువ

ప్రజాశక్తి- తాడేపల్లి



నిత్యం జనం రాకపోకలు సాగించే చోటికి సుమారు ఎనిమిది అడుగుల పొడవున్న కొండ చిలువ రావడంతో ఆ ప్రాంత వాసులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. బుధవారం తెల్లవారుజామున ఉండవల్లి సెంటర్ శ్మశానం వద్ద కొండ చిలువ కనిపించడం స్థానికంగా కలకలం రేపింది. స్థానిక యువకులు వెంటనే దాన్ని మట్టుపెట్టారు. ఇంత పెద్ద కొండ చిలువ నివాస ప్రాంతాల్లోకి రావటంతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది. ఇళ్ల చుట్టూ పెద్ద ఎత్తున పిచ్చిచెట్లు పెరగ టంతో ఏ క్షణంలో ఇంకేం వస్తాయో అని భయపడుతున్నారు. వెంటనే అటవీశాఖ అధికారులు కొండ ప్రాంతాలలో రక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

తురకపాలెం మృతుల కుటుంబాలకు రూ.కోటి ఇవ్వాలి

గ్రామాన్ని సందర్శించిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

అంతు చిక్కని కారణాలతో అతలాకుతలమై, పలు మరణాలు సంభవించిన గుంటూరు రూరల్ మండలం తురకపాలెంలో పర్యటించి, బాధితులను వైసిపి నాయకులు బుధవారం పరామర్శించారు. తురకపాలెంలో మరణాలకు కారణాలు చెప్పలేక పోవడం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం, బాధ్యతా రాహిత్యమనీ వైసిపి నాయకుల ఆక్షేపణ వ్యక్తం చేశారు. కేవలం రూ.5 లక్షలతో మృతుల కుటుంబాలకు మేలు జరగదని, 45 మంది చనిపోతే 29 కుటుంబా లకే పరిహారం ఇచ్చారని తెలిపారు. గ్రామంపై సాంఘిక బహిష్కరణనూ పట్టించు కోవడం లేదన్నారు. తురకపాలెం దళితవాడలో సురక్షిత మంచినీటి వ్యవస్థ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి ఫౌండేషన్ నుంచి ఆర్వో ప్లాంట్ నెల రోజుల్లో ప్లాంట్ ఏర్పాటు చేసి మంచినీరు అందిస్తామనీ మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. దాదాపు 10 నెలలుగా అంతు చిక్కని కారణాలతో 50 మంది కి పైగా మతి చెందగా అధికారులు పట్టించు కోలేదన్నారు. మృతుల కుటుంబాలకు రూ. కోట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న బాధితులకు ఉచితంగా వైద్యం చేయించాలని, గ్రామంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం గుంటూరు నగరం నుంచి పైపులైన్ ఏర్పాటు చేయా లన్నారు. ఎమ్మెల్సీ మొండితోక జగన్మోహన్ రావు, వైసిపి నాయకులు బాలసాని కిరణ్, గోపిరెడ్డి శ్రీనివా సరెడ్డి, గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి , పోతిన మహేష్, షేక్ నూరి ఫాతిమా, అన్నాబత్తిన శివకుమార్ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కృతిక శుక్లా, జెసి తదితరులు

పరిశ్రమల వృద్ధి, ఉపాధి కల్పన కోసం డ్రైవ్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పరిశ్రమల ఆధునికీకరణ, పర్యావరణ పరిరక్షణ, పరిశ్రమల అభివృద్ధి, శుభ్రత కార్యక్రమాలను ప్రోత్సహించే దిశగా ఎపిఐఐసి ఇండస్ట్రియల్ పార్ట్‌నర్‌షిప్ డ్రైవ్‌లో భాగంగా విస్తృత కార్యక్రమాలు ప్రారంభించినట్లు పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా తెలిపారు. ఈ మేరకు పోస్టర్‌ను నరసరావుపేటలోని తన కార్యాలయంలో కలెక్టర్ బుధవారం ఆవిష్కరించి మాట్లాడారు. పరిశ్రమల వృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణా సమానంగా ముందుకు సాగాలన్నారు. పరిశ్రమల మౌలిక సదుపాయాల ఆధునీకరణ, స్థిరమైన అభివృద్ధి చర్యలు, పరిశ్రమలు, పెట్టుబడుల ప్రోత్సాహ కార్యక్రమాలు, శుభ్రత - పారిశుధ్య డ్రైవ్, మొక్కల నాటే కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. శుభ్రమైన పారిశ్రామిక వాడలు స్థాపన, పెట్టుబడిదారుల సహకారం ద్వారా పరిశ్రమల వృద్ధి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పనే లక్ష్యంగా వచ్చే నెల 15 వరకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపిడి సత్యనారాయణ

ఉపాధిహామీ కూలీలకు ఇకెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

ఉపాధిహామీ కూలీలకు ఇకెవైసి తప్పనిసరిగా చేయించాలని గురజాల ఏపీడీ జి.సత్యనారాయణ ఆదేశించారు. స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లతో ఆయన బుధవారం సమీక్షించారు. మండలంలో మొత్తం 22 వేల మంది క్రియాశ్శీలక ఉపాధి హామీ కూలీలకు ఇకెవైసి చేయాల్సి ఉండగా ఉండగా ఇప్పటివరకు 14 వేల మందికి చేశామని, మిగిలిన వారికి త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. నీటి సంరక్షణ పనులు, పంట కుంటలు, ఇంకుడు గుంతలు, రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్‌లను గుర్తించి అంచనాలు రూపొందించాలని ఏపీవో నాగ శ్రీనివాస్ కోరారు. సమీక్షలో గురజాల క్లస్టర్ సిబ్బంది, మాచర్ల ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్స్, టెక్నికల్ అసిస్టెంట్స్, జెఈ గోపి పాల్గొన్నారు.

ఉషూ పోటీల్లో శ్రీమద్ది కామయ్య జెడ్పీ పాఠశాల విద్యార్థికి పతకం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాజమండ్రిలో ఇటీవల జరిగిన అండర్-17 ఉషూ పోటీల్లో తమ పాఠశాల 9వ తరగతి విద్యార్థి హమీద్‌బాష సిల్వర్ మెడల్ సాధించినట్లు పసుమర్రులోని శ్రీమద్ది కామయ్య జెడ్పి పాఠశాల హెచ్‌ఎం హనుమంతరావు బుధవారం తెలిపారు. రాష్ట్రస్థాయిలో పతకం ఇదే మొదటిసారని అన్నారు. నరసరావుపేటలో నిర్వహించిన డివిజన్ స్థాయి బ్యాడ్మింటన్ అండర్-17 పోటీల్లో తమ విద్యార్థినులు కోట కవిత, షేక్ పర్వీన్, అట్లూరి శైలు ప్రతిభ చూపి ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ఎంపికయ్యారని తెలిపారు. వీరిని 15వ వార్డు కౌన్సిలర్ జాలాది సుబ్బారావు, పూర్వ విద్యార్థి సంఘం ప్రతినిధులు గద్దె హరిబాబు, ఎస్‌ఎంసి చైర్మన్ కోటా సుదర్శన్, ఉపాధ్యాయులు అభినందించారు.

సాగు సమయం మళ్లీ వస్తున్నా అమ్ముడవ్వని పంట

- కోల్డ్ స్టోరేజీల్లో 20 లక్షల బస్తాల శనగ - ధరలు పతనమై అమ్ముకోలేని రైతులు
- క్వింటాక్ రూ.8 వేలకు ప్రభుత్వమే కొనాలని వేడుకోలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట





రబీ సీజన్ మొదలు కావొస్తున్నా గత రబీలో వేసిన శనగలను అమ్ముకోలేకపోయామని రైతులు ఆవేదనకు గురవుతున్నారు. ఈ నెలాఖరుకు రబీ సీజన్ ప్రారంభం కాన్నున్న నేపథ్యంలో మళ్లీ సాగుకు తాము పెట్టుబడులు ఎలా సమకూర్చోకోవాలని రైతులు కంగారు పడుతున్నారు. గతేడాది మండలంలో5500 ఎకరాల్లో పొగాకు, 2300 ఎకరాల్లో శనగ పంటలు సాగయ్యాయి. పొగాకు మొత్తం కొంటామని ప్రభుత్వం ప్రకటించినా ఇప్పటికీ 10-15 శాతం పొగాకు రైతుల వద్దే ఉంది. మరోవైపు శనగ పంట సైతం చిలకలూరిపేట మండలంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లోని రైతులందరిదీ కలిపి చిలకలూరిపేట పరిసరాల్లోని ఏడు కోల్డ్ స్టోరేజీల్లో సుమారు 20 లక్షల బస్తాలు (బస్తా 60 కేజీలు) నిల్వ ఉన్నాయి. సరైన ధర వచ్చినప్పుడు అమ్ముకుందామని భావించిన రైతులకు నిరాశే ఎదురైంది. గతేడాది శనగకు ప్రభుత్వం మద్దతు ధర రూ.5350 ప్రకటించింది. ప్రైవేటు వ్యాపారులు రూ.6400 వరకు కొనుగోలు చేశారు. అయితే ధర ఇంకాస్త పెరిగితే తమకు పెట్టుబడులైనా తిరిగొస్తాయని రైతులు భావించి పంటను కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉంచి ధర కోసం నిరీక్షించారు. అనంతరం ధర ఒక్కసారిగా రూ.5300కు అంటే ప్రభుత్వం ప్రకటించిన దానికంటే తక్కువకే పడిపోయింది. దీంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో పడ్డారు. గతేడాది శనగ సాగుకు రైతులు ఎకరాకు రూ.20 వేలు కౌలుచెల్లించారు. విత్తనాలు, దుక్కులు, ఎరువులు, కూలి తదితర ఖర్చులన్నీ కలిపి రూ.27 వేల వరకు అయ్యాయి. మొత్తం ఎకరా శనగ సాగుకు రూ.47 వేలైంది. దిగుబడి సగటున 8 క్వింటాళ్లు వచ్చింది. ఇప్పుడున్న ధరకు పంట అమ్మితే నష్టపోతామని రైతులు చెబుతున్నారు. మరోవైపు ఈ ఏడాది కూడా సాగు చేయడానికి పెట్టుబడులు లేవని, గత అప్పులే తీర్చక వడ్డీలు పెరుగుతున్నాయని రైతులు ఆవేదనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రూ.8 వేలకు కొనాలని డిమాండ్ చేస్తున్నారు. రైతుల వద్ద మిగిలిన పొగాకునూ కొనాలని కోరుతున్నారు.

చేపల చెరువులతో మక్కెన రూ.కోట్ల అక్రమార్జన : బొల్లా

ప్రజాశక్తి - వినుకొండ

కల్తీ మద్యంపై రాష్ట్ర ఆందోళనలో భాగంగా ర్యాలీ చేసి వినతిపత్రం అందజేస్తే.. మహిళలను తాగుతున్నారన్నారని తాను వ్యాఖ్యానించాని వక్రీకరిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడ చూసినా బెల్ట్ షాపులు వల్ల మద్యం తాగి బజార్లలో తిరుగుతుంటే మహిళలు ఇబ్బందులు పడుతున్నారని తానంటే.. ఆ మాటను పలుమార్లు సోషల్ మీడియాలో చూపించి తనపై బురద చల్లడం ఏమిటని ప్రశ్నించారు. మహిళలంటే తమకు ఎంతో గౌరవమని, నియోజకవర్గంలో ఎప్పుడూ లేని విధంగా మహిళలకు జెడ్‌పిటిసి, ఎంపిపి, ఎంపిటిసి పదవులు ఇచ్చామని, 50 శాతం మహిళా రిజర్వేషన్ అమలు చేసి చూపించామని అన్నారు. వినుకొండలో ఐదువేల మంది మహిళలకు ఇళ్లపట్టాలి ఇచ్చామని, సంక్రాంతి కానుకగా లక్ష మందికి తన సొంత నిధులతో చీరలు పంచానని చెప్పారు. జీడీసీసీబీ చైర్మన్ అయిన మక్కెన మల్లికార్జునరావు నియోజకవర్గంలోని చేపల చెరువులను తన స్వాధీనం చేసుకొని సొసైటీలను చేతిలో పెట్టుకొని రూ.కోట్ల అక్రమాలకు పాల్పడుతున్నారని, దీనిపై తాను విమర్శిస్తే సరైన సమాధానం చెప్పకుండా చిన్నచిన్న మాటలను వక్రీకరించి ద్వందార్థాలు తీయడం వంటివి చేస్తున్నారని అన్నారు. దొండపాడు మాజీ సర్పంచ్ మోద్దుకూరి రామబ్రహ్మం అధికారులను దుర్భాషలాడాడని, నీలగంగారం గ్రామానికి చెందిన కొండలు అనే వ్యక్తికి రూ.60 లక్షల పనులు చేయకుండానే బిల్లుల్చి.. మాకెందుకివ్వరంటూ తిట్టారని, ఇది నిజం కాదా? అని ప్రశ్నింకారు. పెద్ద కంచర్ల, కుంట మక్కెన మల్లికార్జునరావు తన ఆధీనంలో పెట్టుకొని బ్యాంకులో రుణాలు తీసుకున్నారని, ఇందుకు తన వద్ద ఆధారాలున్నాయని బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు.

నిబంధనల ప్రకారమే వ్యాపారం : మక్కెన

ప్రజాశక్తి - వినుకొండ

మహిళలను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అంశాన్ని కప్పిపుచ్చుకునేందుకు నిరాధారమైన ఆరోపణలు చేయటం సిగ్గుచేటని జిడిసిసిబి చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు అన్నారు. పట్టణంలోని చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. బొల్లా బ్రహ్మనాయుడు నోటికొచ్చినట్లు పొంతన లేకుండా మాట్లాడుతున్నారని, ఎక్సైజ్ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడిన ఆయన... ఆడవాళ్లు మందు తాగుతున్నారని కించపరిచే విధంగా మాట్లాడిన ఆయన క్షమాపణలు చెప్పకుండా వక్రీకరణంటూ కప్పిపుంచుకుంటున్నారని అన్నారు. ఆయన స్పష్టంగా మాట్లాడిన మాటలు వీడియో రికార్డు అయ్యాయని, వాటిని టిడిపి, కూటమి నాయకులు మార్ఫింగ్ చేసి ఉంటే నిజం నిర్ధారణకు పంపుదామని సవాలు విసిరారు. తాను చేపల వ్యాపారం చేస్తున్నానని, సొసైటీ నిబంధనల ప్రకారం పెట్టుబడులు పెట్టి వ్యాపారం చేస్తున్నాని అన్నారు. ఎదుటి వారి వ్యాపారాల గురించి మాట్లాడేటప్పుడు ఆయన వ్యాపారం ఏంటో చెప్పాలన్నారు. తండ్రి గేదెల దళారి చేస్తూ వచ్చిన కమీషన్ పై బొల్లాను సాకాడని, బొల్లా డబ్బాలు నెత్తిన పెట్టుకొని గ్రామాల్లో సినిమాలు వేశాడని, ఆయన జీవితం అందరికీ తెలుసని ఎద్దేవ చేశారు.

అనుమతికి మించి మైనింగ్?

- ఎనిమిదెకరాలు ఆక్రమణ - అర్హులకు భూములిస్తాం
- మూడు గ్రామాలకు 2079 పాస్‌పుస్తకాలు సిద్ధం : ఆర్‌డిఒ
- ఇనిమెళ్లలో ప్రభుత్వ భూముల పరిశీలన



భూమిని పరిశీలిస్తున్న ఆర్డీవో కె మధులత తదితరులు

ప్రజాశక్తి-ఈపూరు

ప్రభుత్వ భూములను ఆక్రమించిన వ్యక్తులకు నోటీసులు ఇచ్చి ఆన్‌లైన్‌లో వివరాలను తొలగిస్తామని ఆర్‌డిఒ కె.మధులత చెప్పారు. పిజిఆర్‌ఎస్ ఫిర్యాదుల నేపథ్యంలో మండలంలోని ఇనిమెళ్ల గ్రామ సమీపంలో 504/15 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిని ఆర్‌డిఒతోపాటు జిల్లా సర్వేయర్ సిహెచ్ భానుకీర్తి, అటవీ రేంజ్ అధికారి మాధవరావు, మైనింగ్ సర్వే అధికారి రవితేజ బుధవారం పరిశీలించారు. అనంతరం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆర్‌డిఒ విలేకర్లతో మాట్లాడారు. మైనింగ్ నిర్వహణకు మూడు హెక్టార్ల (హెక్టారు : రెండున్నర ఎకరాలు) భూమికోసం దరఖాస్తు, ఇనిమెళ్ల గ్రామానికి చెందిన కొందరు భూమికోసం దరఖాస్తులు చేసుకున్న క్రమంలో ప్రభుత్వ భూమిని పరిశీలించామన్నారు. 504/15 సర్వే నెంబర్ లో 381.97 ప్రభుత్వ భూమి ఉందని దానిలో 100 ఎకరాలకు వేరే సర్వే నంబర్లు కేటాయించి కొంత భూమిని అసైన్మెంట్ చేయగా మిగిలినది ప్రభుత్వ భూమిగా ఉందని, దానిలో ఎనిమిదెకరాలు ఆక్రమణకు గురైనట్లు గుర్తించామని తెలిపారు. గతంలో పదేళ్ల కాల పరిమితితో ఆరుగురు మైనింగ్ అనుమతులు పొందగా వాటిలో ఒకటి మాత్రమే పని చేస్తోందని, మైనింగ్ లీజుదారులు కేటాయించిన భూమిని దాటి కార్యకలాపాలు చేస్తున్నారని తెలిసిందని, సర్వే చేయిస్తామని వివరించారు. దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం అసైన్మెంట్ కమిటీ ద్వారా అర్హులైన పేదలకు భూ పంపిణీ చేస్తామన్నారు. మండలంలో రీసర్వే పూర్తయిన చిట్టాపురం, గుండెపల్లి, వనికుంట గ్రామాలకు సంబంధించి 2079 పాస్ పుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. మ్యుటేషన్ దరఖాస్తులు సకాలంలో చేసేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఇంటి స్థలాల కోసం 124 మంది దరఖాస్తు చేసుకోగా వారందరిని అనర్హులుగా గుర్తించి దరఖాస్తులు తిరస్కరించామని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎ.నళిని, ఆర్‌ఐ రామారావు పాల్గొన్నారు.

మహా ధర్నాకు తరలిరండి



మాట్లాడుతున్న ఎం రవి

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి కార్పొరేషన్ పరిధిలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాల హామీని మంత్రి నారా లోకేష్ వెంటనే అమలు చేయాలని, 17న మహాధర్నాకు వేలాదిగా ప్రజలు తరలి రావాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.రవి కోరారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ జరుగుతున్న నిరసన దీక్ష బుధవారం నాటికి మూడో రోజుకు చేరింది. దీక్షా శిబిరాన్ని రవి ప్రారంభించి మాట్లాడుతూ ఎన్నికల ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. 20 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇల్లు నిర్మించి ఇస్తానని చెప్పి ఇంతవరకు ఇళ్ల స్థలాల లిస్ట్ కూడా ప్రకటించలేదని అన్నారు. టిట్కో గృహాలు నిర్మించి ఇస్తామని చెప్పడం పేద ప్రజలను మోసం చేయడమే అన్నారు. ఇప్పటికే టిడ్కో గృహాలలో ఉంటున్న కుటుంబాల వారు అనేక సమస్యలను ఎదుర్కొంటూ అక్కడ నివాసం ఉండలేకపోతున్నారని అన్నారు. రెండు సెంట్లు స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు మాట్లాడుతూ ఈనెల 17వ తేదీన కార్పొరేషన్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాకు అర్జీలతో పేద ప్రజలు తరలిరావాలని కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో మంగళగిరి మండలం రూరల్ సిపిఎం కార్యదర్శి యు.దుర్గారావు, సిపిఎం మంగళగిరి పట్టణ కార్యదర్శి వి.వి.జవహర్‌లాల్, సిపిఎం గుంటూరు జిల్లా నాయకులు ఎస్.ఎస్.చెంగయ్య, సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలాజీ, రాజధాని సిపిఎం నాయకులు వి.వెంకటేశ్వరరావు, ఎ.వీర్లంకయ్య, జి.నాగేశ్వరరావు, ఎం.భాగ్యరాజు, ఆర్.వి.రాఘవయ్య, షేక్ జానీ, తాడేపల్లి మండలం రూరల్ కార్యదర్శి పల్లె కృష్ణ, మంగళగిరి మండలం రూరల్ సిపిఎం నాయకులు టి.ప్రసాద్‌రెడ్డి, బి.సత్యమారెడ్డి, జి.బాబు వరప్రసాద్, జి.అజయ్ కుమార్, సిహెచ్. రామాంజనేయులు, ఎం.సంధ్య తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో అవకతవకలు జరుగుతున్నాయి


మాట్లాడుతున్న ఖాజావలి

ప్రజాశక్తి - పెదకాకాని

శతాబ్దాల చరిత్ర కలిగిన స్థానిక బాజీ బాబా దర్గాలో పలు అవకత వకలు జరుగుతున్నాయని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్ ఖాజావలి ఆరోపించారు. రాష్ట్రంలోనే పేరుగాంచిన దర్గాలలో ఒకటైన బాజీ బాబా దర్గాను ప్రజలు కుల మతాలకతీతంగా వచ్చి ప్రార్థనలు, మొక్కుబడులు చెల్లించుకుంటారని అలాంటి చోట హుండీల లెక్కింపులో అవకతవకలు జరుగుతున్నట్లు ఖాజావలి బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆరోపించారు. వక్ఫ్ బోర్డుకు సీఈఓగా ఇంటర్మీడియట్ చదివిన వ్యక్తిని నియమించారని, ఆయనకు కనీస పాలన విధులు తెలియదన్నారు. హుండీ లెక్కింపు సమయంలో వీడియో తీసే వ్యక్తిని వెంటనే తీసుకుంటున్న చర్యలు పారదర్శకంగా లేవని వెంటనే అవి మార్చాలన్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో కోర్టుకు వెళ్లడానికి సిద్ధం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి షేక్ షరీఫ్, నగర కార్యదర్శి షేక్ యాసిన్, నగర యువత అధ్యక్షులు షేక్ షాకీర్ పాల్గొన్నారు.


వడ్డేశ్వరం జడ్పీ హైస్కూల్లో కంప్యూటర్ ల్యాబ్ పనులు పరిశీలిస్తున్న డిప్యూటీ విద్యాశాఖ అధికారిని జి.శాంతకుమారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాకుమాను జోజప్ప, ల్యాబ్ పరిశీలిస్తున్న టిడిపి గ్రామ సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూధనరావు

ముస్తాబవుతున్న డిజిటల్ కంప్యూటర్ ల్యాబ్

ల్యాబ్ పనులను పరిశీలించిన డిప్యూటీ విద్యాశాఖ అధికారి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

విద్యార్థిని విద్యార్థులు చదువుతోపాటు, టెక్నాలజీని, మేధాశక్తిని పెంపొందించుకునేందుకు ఏర్పాటు చేస్తున్న ఎంటిఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం జిల్లా పరిషత్ హై స్కూల్ నందు డిజిటల్ కంప్యూటర్ ల్యాబ్ పనులను బుధవారం ఉప విద్యాశాఖ అధికారిని జి.శాంతకుమారి పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాకుమాను జోజప్పతో కలిసి పరిశీలించారు. విద్యార్థుల అభ్యున్నతి కోసం తాను సొంత నిధులను వెచ్చించి, పాటుపడుతున్న ప్రధానోపాధ్యాయులు కాకుమాను జోజప్పను ఆమె అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాకుమాను జోజప్ప మాట్లాడుతూ హై స్కూల్లో ఇప్పటికే ఆరు కంప్యూటర్లు ఉన్నాయని అన్నారు. ల్యాబ్‌కు ఏసీలు ఏర్పాటు చేసి, మరో 10 కంప్యూటర్లను దాతల సహాయంతో ల్యాబ్‌కు సమకూర్చి, విద్యార్థులకు కంప్యూటర్ విద్య అందించాలని దఅఢ సంకల్పంతో తానే ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. త్వరలో ప్రారంభం కానున్న డిజిటల్ కంప్యూటర్ ల్యాబ్‌లో సీలింగ్, ఫర్నీచర్ పనులను గ్రామ నాయకులు కాట్రగడ్డ మధుసూదనారావు, చావలి సురేష్ తదితరులు పరిశీలించి, ప్రధానోపాధ్యాయులు కాకుమాను జోజప్పకు అభినందనలు తెలిపారు.

రైతులు, కష్టజీవుల సమస్యలపై పోరాడిన నేత తేళ్ల నారాయణ


తేళ్ల నారాయణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న నాయకులు, సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు

ప్రజాశక్తి - పెదనందిపాడు


రైతులు, కష్టజీవుల సమస్యల పరిష్కారానికి పోరాడిన నేత కామ్రేడ్ తేళ్ల నారాయణ అని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు అన్నారు. నారాయణ 3వ వర్థంతి సందర్భంగా బుధవారం పెదనందిపాడు లోని తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో ఆయన చిన్నపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ట్రంప్ సుంకాలు - భారతదేశంపై ప్రభావం అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం విజ్ఞాన కేంద్రం కన్వీనర్ దొప్పలపూడి రమేష్ బాబు అధ్యక్షతన జరిగింది. పాశం రామారావు మాట్లాడుతూ తేళ్ల నారాయణతో తనకు 35 సంవత్సరాల నుంచి అనుబంధం ఉందని తెలిపారు. చివరి వరకు తాను నమ్మిన సిద్ధాంతాల కోసం నిలబడ్డారన్నారు. రైతులు, కష్టజీవుల సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు చేశారని తెలిపారు. పాలపర్రు గ్రామంలో అమరవీరుల స్తూపం ఏర్పాటులో కీలకపాత్ర పోషించారన్నారు. వారి స్ఫూర్తితో ముందుకు సాగటమే మనం వారికి ఇచ్చే నివాళి అని తెలిపారు. ట్రంప్ సుంకాలు - భారతదేశంపై ప్రభావం గురించి మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్ లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రారంభించిన వాణిజ్య యుద్ధం భారతదేశంతో పాటు ప్రపంచ దేశాలు అన్నింటి పైన తీవ్ర ప్రభావం చూపుతోందని తెలిపారు. భారతదేశ వ్యవసాయ రంగాన్ని ధ్వంసం చేస్తుందని, పారిశ్రామిక ఉత్పత్తిని దెబ్బతీస్తుందని, సేవారంగం గందరగోళంలో పడుతుందని, ఆర్థిక సంక్షోభాన్ని తీవ్రతరం చేస్తుందని తెలిపారు. మన రాష్ట్రంలో ఆక్వా, టెక్స్ టైల్, గార్మెంట్, పట్టు వంటి రంగాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని తెలిపారు. వాటిలో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు రోడ్డున పడే పరిస్థితి ఉందన్నారు. ఇంటా బయటా ఉపాధి అవకాశాలు దెబ్బతిని విద్యార్థులు, యువత భవిష్యత్తు ఆగమ్య గోచరంగా ఉందన్నారు. ఈ పరిస్థితిని ఎదుర్కొని మన దేశ ప్రయోజనాలను కాపాడుకునేలా ప్రత్యామ్నాయ మార్గాలను అందిపుచ్చుకోవాల్సిన కేంద్ర బిజెపి ప్రభుత్వం ట్రంప్ అడుగులకు మడుగులొత్తే లొంగుబాటు వైఖరిని ప్రదర్శిస్తుందని పేర్కొన్నారు. మరోవైపు వ్యవసాయ ఉత్పత్తుల మీద భారతదేశం విధిస్తున్న సుంకాలను ఎత్తివేయించి భారతీయ మార్కెట్లను అమెరికా దిగుమతులతో నింపేయాలని ట్రంప్ ఎత్తుగడ వేశారని చెప్పారు. దాంతో మన దేశ వ్యవసాయ, డైరీ, ఉద్యానవన ఉత్పత్తుల ధరలు పడిపోతాయని తెలిపారు. రైతాంగం దివాలా తీసి మొత్తం వ్యవసాయ రంగం కుదైలుగుతుందని, మోడీ ప్రభుత్వం పార్లమెంటును కానీ, రాష్ట్రాలను కానీ విశ్వాసంలో తీసుకోకుండా అమెరికాతో ఒప్పందాలకు అడుగులు వేసిందని వివరించారు. అదేవిధంగా వీసా నిబంధనలు కఠిన తరం చేయడంతో ఉన్నత చదువులు చదివేందుకు అమెరికా పోవాలన్న ఎంతోమంది విద్యార్థులు ఆశలు అడియాసలు అవుతున్నాయని తెలిపారు. మన ఎగుమతులకు ప్రత్యామ్నాయ మార్కెట్లను అన్వేషించాలని, దేశీయంగా వినియోగం పెంచేందుకు ప్రజల కొనుగోలు శక్తి పెంచే చర్యలు వెంటనే చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి దొప్పలపూడి రమేష్ బాబు మాట్లాడుతూ తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రం 2023లో నిర్మించడం జరిగిందని తెలిపారు. అప్పటి నుండి మహిళలకు కుట్టు శిక్షణ, విద్యార్థులకు శిక్షణా తరగతులు వంటి బహుముఖ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామి తెలిపారు. మంచి పుస్తకం నిర్వాహకులు కాపు శ్రీనివాస్ మాట్లాడుతూ తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రం నిర్మాణంలో తమ వంతు సహాయం అందించామని, నిర్మాణంలో భాగస్వామ్యం కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. పెట్టుబడిదారి విధానాలకు వ్యతిరేకంగా రైతులు, కార్మికుల సంక్షేమం కోసం పనిచేయటమే నారాయణకు మనం ఇచ్చే నివాళి అని తెలిపారు. పెన్షనర్ల సంఘం నాయకులు నూరు భాషా సుభాని సాహెబ్, రైతు సంఘం నాయకులు కొత్త వెంకటశివరావు, తేళ్ల ప్రభాకర్, కాపు వెంకట సుబ్బారావు, చెన్నుపాటి సురేంద్రలు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. సమావేశంలో విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల కమిటీ కన్వీనర్ జంపని రామారావు, తేళ్ల నాగరాజు, తేళ్ల రాము, ముద్దన వెంకటేశ్వర్లు, అన్నల దాసు ఆశీర్వాదం, గుగ్గిలం సాయిబాబు, గద్దె మల్లేశ్వరరావు, మౌలాం సాహెబ్, తమలపాకుల ఆనందరావు, ఆళ్ల విజయ్, మర్రి లక్ష్మి, షేక్ షమీ, కొరివి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


అర్జీలు అందజేస్తున్న నాయకులు

రెండు సెంట్లు ఇళ్ల స్థలం ఇవ్వాలి

ప్రజాశక్తి-తాడేపల్లి

మంత్రి నారా లోకేష్ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన వాగ్దానం మేరకు అర్హులైన పేదలందరికీ రెండు సెంట్లు ఇళ్ల స్థలం ఇవ్వాల్సిందేనని సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి, పెనుమాక నాయకులు ఎస్.కె.పీరుసాహెబ్, ఎస్.కె.ఖాదర్ బాబా డిమాండ్ చేశారు. బుధవారం ఇళ్ల స్థలాలు కోసం సిపిఎం కార్యకర్తలు పెనుమాకలో పేదలకు అర్జీలు అందజేశారు. ఎంటిఎంసి పరిధిలో స్థలాలు లేని పేదలందరికీ ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా రెండు సెంట్లు స్థలం ఇచ్చి, ఇల్లు నిర్మించుకునేందుకు 5 లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం టిట్కో ఇల్లు ఇస్తామని చెబుతుందని, టిడ్కో ఇళ్లపట్ల లబ్ధిదారులు అయిష్టంగా ఉన్నారని చెప్పారు. ఇళ్ల స్థలాల సాధన కోసం ఈనెల 17న మంగళగిరిలో జరిగే ధర్నాలో పాల్గొని అర్జీలు అధికారులకు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్.కె.ఎర్ర పీరు, షేక్ ఖాదర్ బాబా తదితరులు పాల్గొన్నారు.


జీతాలు చెల్లించాలని అర్జీ అందజేస్తున్న కార్మికులు

పెండింగ్ జీతాలు చెల్లించాలి : సిఐటియు

ప్రజాశక్తి-తాడేపల్లి

మధ్యాహ్నం భోజన కార్మికులకు నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే చెల్లించాలని సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వి.దుర్గారావు కోరారు. బుధవారం తహసీల్దార్ డి.సీతారామయ్యను సంఘం మండల కార్యదర్శి కృష్ణకుమారి, బాలకోటమ్మతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు కనీసం రూ 10,000 నెలకు జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఇస్తున్న 3000లతో కుటుంబం ఎలా గడుస్తుందని ప్రశ్నించారు. నెల, నెల జీతాలు సక్రమంగా వచ్చే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి.సలోమి, శేషకుమారి, కె.గ్రేసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్ బాల్ పోటీల్లో వివా విద్యార్థి ప్రతిభ


జోయల్‌ను అభినందిస్తున్న ఛైర్మన్

ప్రజాశక్తి - పెదకాకాని

నంబూరు గ్రామంలోని వివా ది స్కూల్‌కు చెందిన ఇంటర్ విద్యార్థి చుక్కా జోయల్ ప్రతిభ చూపాడని ఛైర్మన్ వాసిరెడ్డి మహదేవ్ తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 5 నుండి 10వ తేదీ వరకూ జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన 69వ జాతీయ స్కూల్ గేమ్స్ పోటీలలో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించి ప్రతిభ కనబరిచాడని తెలిపారు. సెప్టెంబర్ 22 నుండి 25 వరకూ స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన రాష్ట్రస్థాయి జట్టు ఎంపికలలో ప్రతిభ కనబరిచి 69వ జాతీయ స్కూల్ గేమ్స్‌కు రాష్ట్రజట్టు తరపున ఎంపికయ్యాడన్నారు. అనంతరం చుక్కా జోయల్ ను వివా ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, డైరెక్టర్ ఎల్.టి. కమాండర్ కె.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ చదలవాడ సరళ, పిఈటీలు అభినందించారు.



శిక్షణలో హరిత రాయబారులు, షెడ్ మిత్రలు

పరిశుభ్రతలో హరిత రాయబారులది కీలకపాత్ర

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

గ్రామాలు పరిశుభ్రంగా ఉంచడంలో హరిత రాయబారులు కీలకపాత్ర పోషిస్తున్నారని సత్తెనపల్లి ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి అన్నారు. పరిశుభ్రత, పచ్చదనంపై మండలంలోని హరిత రాయబారులు, షెడ్‌మిత్రలకు బుధ వారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమాన్ని ఎంపిడిఓ బండి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ హరిత రాయబారులు గ్రామాల్లో పారిశుధ్య పనులు శ్రద్ధగా వహించాలని అన్నారు. శిక్షణలో భాగంగా గ్లోబల్ హ్యాండ్ వాష్‌డేను నిర్వహించారు. చేతుల పరిశుభ్రత పట్ల హరిత రాయబారులకు సంపూర్ణ అవగాహన కల్పించారు. పరిశుభ్రత- పచ్చదనం, ఘన వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ, స్వచ్ఛరథం, హరిత రాయబారుల హక్కులు, అవకాశాలు అనే అంశాలపై అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శులు కుంభ వెంక టేశ్వర్లు, చెల్లంచెర్ల శ్రీనివాసరావు, కాల్వపల్లి అంజి రెడ్డి, చిలువూరి కృష్ణప్రసాద్, మాస్టర్ ఆఫ్ ట్రైనర్‌లుగా వ్యవహరించారు.

జాతీయ పరుగు పందెం పోటీలకు అబ్దుల్లా

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణానికి చెందిన పరుగుల వీరుడు, యువ క్రీడాకారుడు షేక్ అబ్దుల్లా నవంబర్ 2న శ్రీనగర్ మారథాన్‌లో, నవంబర్ 9న జమ్మూ బిఎస్ఎఫ్ మారాథాన్‌లో డిసెంబర్ 14న ఎస్‌బిఐ న్యావి వైజాగ్ మరాథాన్‌లో, డిసెంబర్ 21న టాటా స్టీల్ వరల్డ్ కలకత్తా మారాథాన్‌లో, జనవరి 18, 2026న టాటా ముంబై మారాథాన్ జాతీయ పోటీలలో పాల్గొన బోతున్నట్లుగా తెలిపారు. ఎన్నో జాతీయ, అంతర్జాతీయ పరుగు పందెం పోటీలలో పాల్గొని గోల్డ్, సిల్వర్, రజిత పతకాలు అందుకున్న అబ్దుల్లా జన్మభూమికి, రాష్ట్రానికి ప్రఖ్యాతలు తీసుకురావాలని మిత్ర బృందం, పెద్దలు, పట్టణ ప్రముఖులు అభినందనలు తెలియజేశారు.

ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయించాలి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయించాలని సత్తెనపల్లి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పీ విజయకుమార్ వైన్ షాప్ నిర్వాహకులకు సూచించారు. సత్తెనపల్లి ఎక్సైజ్ కార్యాలయంలో బార్, వైన్‌షాపు నిర్వాహలతో సిఐ విజయ్‌కుమార్ బుధ వారం సమావేశం నిర్వహించారు. నకిలీ మద్యాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ గురించి అవగాహన కల్పించారు. నకిలీ మద్యం విక్రయిస్తే షాపులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఒక వ్యక్తికి మూడు బాటిల్స్ మాత్రమే విక్రయించాలని దేశించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై నాగలక్ష్మి పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో 10 మందికి కొలువులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలంలోని కేసానుపల్లి గ్రామ పరిధిలోని మేదరమెట్ల అంజమ్మ మస్తాన్ రావు (ఎంఏఎం) పీజీ కళాశాలలో బుధవారం బెంగళూరుకు చెందిన ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ క్యూస్పైడర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో కళాశాలకు చెందిన 10మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామ శేషగిరిరావు మాట్లాడుతూ విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాలు, కమ్యూనికేషన్ సామర్థ్యాలను అంచనా వేసేందుకు రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ దశల్లో ఎంపిక ప్రక్రియ చేపట్టారని వెల్లడించారు. ఎంపికైన విద్యార్థులకు వార్షిక వేతనం రూ.4లక్షల వరకు లభించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాదినేని రామారావు తెలిపారు. ఈ సందర్భంగా ప్లేస్‌మెంట్ ఆఫీసర్ జె. రవిశంకర్, విభాగాధి పతులు నవీన్, సితార విద్యార్థులను అభినందించారు.

అబ్దుల్ కలాం జయంతి వేడుకలు



మాచర్ల వివేకానంద ట్రస్టు ఆధ్వర్యంలో



ఎఎన్‌యూలో...



తాడేపల్లిలో...

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో జనవిజ్ఞాన వేదిక, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో డాక్టర్ ఏపీజే బ్దుల్ కలాం 94వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. చిలకలూరి పేట విద్యా సంఘం అధ్యక్షులు తేళ్ళ సుబ్బారావు అతిథిగా మాట్లాడారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ కే.యస్. లక్ష్మణరావు రాసిన యన్‌యంయంఎస్ పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెవివి అధ్యక్షులు ధూళిపాళ వెంకట్రావు, కార్యదర్శి బొంత అజయ్ బాబు, డాక్టర్ పి.వి. సుబ్బారావు, లాలూదాదా సాహెబ్ సేవా సమితి అధ్యక్షులు సిద్ధాంతి కరిముల్లా, డాక్టర్ దార్ల బుజ్జిబాబు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి

ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా మంగళగిరి వైసిపి నియోజకవర్గ కార్యాలయంలో అబ్దుల్ కలాం చిత్రపటానికి ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, నియోజవర్గ ఇంచార్జ్ డి.వేమారెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళగిరి మండల అధ్యక్షులు నాలి వెంకటకష్ణ యాదవ్, మంగళగిరి పట్టణ అధ్యక్షులు ఆకురాతి రాజేష్, గుంటూరు జిల్లా ఉపాధ్యక్షురాలు పచ్చల రత్నకుమారి, పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో డాక్టర్ అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా అబ్దుల్ కలాం చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు.ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువ జన అధ్యక్షులు పారేపల్లి మహేష్ బీసీ సంక్షేమ సంఘం నాయకులు టి.కిరణ్, ధనుంజయ్, ఆలాశివాజీ, రామారావు, పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చేబ్రోలు

నారా కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా అంతర్జాతీయ యువజన దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు ఏడుకొండలు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి మండల విద్యాశాఖాధికారి ఆర్.సుబ్బారావు, దుగ్గిరాల వాస్త వ్యులు పద్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు చండూరు భాస్కర్‌రావు, పసుపులేటి గణేష్, అడప వెంకట్రావు, పాఠశాల కమిటీ చైర్మన్ వి.గోపినాథ్, పాల్గొన్నారు. తొలుత ముఖ్య అతిథులు కలాం విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

ప్రజాశక్తి - మాచర్ల

ప్రస్తుత సామాజిక రాజకీయ పరిస్థితులను గమనించి తప్పకుండా యువత డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంని ఆదర్శంగా తీసుకోవాలని మద్రాస్ యూనివర్సిటీ ప్రొఫెసర్ మాడభూషి సంపత్‌కుమార్ అన్నారు. మెయిన్ రోడ్డులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక వివి ఎన్ గార్డెన్స్‌లో అబ్దుల్ కలాం సేవా సమితి పదవ వార్షి కోత్సవం సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. గురజాల మున్సిపల్ చైర్మన్ బడే జానీ, ప్రముఖ సిని పాత్రికేయుడు ప్రభు, రిటైర్డ్ డిప్యూటీ డిఇఓ రామకృష్ణారావు, కృష్ణవేణి కాలేజీ ప్రిన్సిపాల్ వెంకట్రామయ్య, గుర్రం జాషువా మనవడు సుశీల్ జాషువా, కవి కరిముల్లా, వాసవీక్లబ్, జోన్ చైర్మన్ ఓరుగంటి చెన్నకేశవ రావు, చాకలి ఐలమ్మ సేవ కమిటీ అధ్యక్షులు ఎం.పాండు రంగారావు, కె.వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

స్వామి వివేకానంద ఛారిటబుల్ ట్రస్ట్ మాచర్ల వారి ఆధ్వర్యంలో స్వామి వివేకా నంద సేవాశ్రమంలో అబ్దుల్ కలాం జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఛారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి సేవాశ్రమంలో ఉన్న అబ్దుల్ కలాం యోగా సభ్యులతో కలసి విగ్రహానికి పూలదండ వేసి నివాళులర్పించారు. అనంతరం చెంచు మహిళలకు, చిన్నారులకు వస్త్రదానం, అన్న దానం చేశారు. రిటైర్డ్ హెడ్మాస్టర్ ఎం.పాపి రెడ్డి, శ్రీహరి, శ్రీని వాసరావు, గుంటూరు ప్రభావతి, ఇందిరా దేవి, స్వరాజ్యం, పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాల ఎదురుగా ఉన్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహం వద్ద జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన విశ్వవిద్యాలయ రెక్టర్ ప్రొఫెసర్ రామినేని శివరాం ప్రసాద్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సురేష్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్, వీరయ్య ఇంజనీరింగ్ కళా శాల ప్రిన్సిపల్ సిహెచ్ లింగరాజు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ కే.తేజమూర్తి, సిడిసి డీన్ ప్రొఫెసర్ కె.రవికుమార్, ఇంజనీరింగ్ కళా శాల అసిస్టెంట్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎమ్. గోపికృష్ణ, డాక్టర్ బి.చంద్రమౌళి ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్‌ఆఫీసర్ డాక్టర్ ఎండి తౌసిఫ్‌అహ్మద్, వర్సిటీ కంట్రోల్ ఆఫ్ ఎగ్జా మినేషన్స్ ఆలపాటి శివప్రసాద్, నోడల్ ఆఫీసర్ రెడ్డి ప్రకాష్, మహాత్మ జ్యోతిరావు పూలే పీఠం చైర్మన్ ఆచార్య త్రిమూర్తి, వికాస నాయకులు జైన్ లాబ్దిన్, ఎండి బషీర్ అహ్మద్, ఇ.రాధాకృష్ణ, కావూరు శ్రీనివాసరావు, డాక్టర్ కన్యాకుమారి, డాక్టర్ సుశీల, అతిథి అధ్యాపకురాలు స్వాతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల

స్థానిక అలీ నగర్ ఉర్దూ పాఠశాల వద్ద అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు స్టేషనరీ, మిఠాయిలు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు వహీదా బేగం విద్యా కమిటీ చైర్మన్ ఆశ టిడిపి నాయకులు జి. వెంకటరావు జి.శ్రీనివాస్ వల్లూరు నరసింహారావు దోస్త్ అధ్యక్షులు మిక్కిలినేని గాంధీ స్థానికులు పాల్గొన్నారు. బాలికల హైస్కూల్లో దాతచుండూరు భాస్కరరావు పుస్తకాలు, స్టేషనరి పంపిణీ చేశారు.

ప్రజాశక్తి - తాడికొండ

దేశం కోసం తన జీవితం అర్పించిన మహనీయుడు మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం అని ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయాల సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బ రత్నమ్మ అన్నారు. తాడికొండ గ్రంథాలయంలో కలాం చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా నరసరావుపేట పట్టణం పల్నాడు రోడ్డులోని కలాం విగ్రహానికి పల్నాడు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ కలాం క్షిపణి శాస్త్రవేత్తగా నేటి యువతకు ఆదర్శంగా నిలిచారన్నారు. గుండెకు వేసే స్టంట్లు పేదలకు ఉపయోగ పడేలా కేవలం రూ.60 వేలకు తయారు చేశారన్నారు. వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో అబ్దుల్ కలాం జయంతి నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ కలాం చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అబ్దుల్‌కలాం జీవిత చరిత్రకు సంబందించిన పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ఆర్.కుమార్, లైబ్రేరియన్స్ జి. శ్రీనివాసరావు, వి.విజయ కుమార్, జూనియర్ అసిస్టెంట్ జి. శ్రీనివాస రావు, రికార్డు అసిస్టెంట్ టి. విజయకుమార్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదనందిపాడు

అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా పెదనందిపాడు శాఖా గ్రంథాలయంలో అబ్దుల్ కలాం చిత్రపటానికి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకులు గేరా మోహనరావు, గ్రంథాలయ నిర్వాహకులు డి శివ నాగేశ్వరరావు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ప్రజాశక్తి - పెదకాకాని

మండల కేంద్రమైన పెదకాకానిలోని గ్రంథాలయంలో కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బంగారు రత్నబాబు,సంగుల సంగీత రావు,లింగంగుంట కిషోర్, గాలి వందనం పాల్గొన్నారు.

ప్రజాశక్తి - క్రోసూరు

అబ్దుల్ కలాం జయంతి, సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమాలను టిడిపి గ్రామ, మండల నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. నాయకులు మాజీ మార్కెట్ యాడ్ చైర్మన్ కాంద్రు కాశయ్య నలజాల కోటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు మొగల్ జాన్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు షేక్ బాషా పాల్గొన్నారు.

ప్రజాశక్తి- తాడేపల్లి

అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా తాడేపల్లి టీడీపీ పట్టణ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు ఆయన చిత్ర పటా నికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ నాయ కులు దారా దాసు, చాంద్ బాషా,ఇట్టా భాస్కర్, మేకా పుల రెండ్డి, అద్దంకి మురళి, యు. శ్రీనివాసరావు, కె.మహాలక్ష్మి, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పొన్నూరు

పొన్నూరు పట్టణంలోని పలువురు ప్రజా సంఘాలు, అంజుమన్ కమిటీ, స్వచ్ఛంద సంస్థలు పలు పార్టీల నాయకులు అబ్దుల్ కలాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి, విగ్రహాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ప్రజాశక్తి-గుంటూరు


అణు శాస్త్రవేత్తగా, భారత రాష్ట్రపతిగా, అత్యున్నత మానవీయ విలువలతో భారతదేశ నిర్మాణ కలలకు దర్పణంగా నిలిచిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితం నేటితరం విద్యార్థులకు, యువతకు ఆదర్శప్రాయమని కన్నా విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ కన్నా మాస్టర్ పేర్కొన్నారు. స్థానిక ఆర్టీసీ కాలనీలోని కన్నా ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో అబ్దుల్ కలాం 95వ జయంతిని విద్యార్థుల స్ఫూర్తి దినోత్సవంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు తనూజ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక టిజెపిఎస్ కాలేజిలో బుధవారం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ సేవా పథకం వారి ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర కళాశాలల పరిధిలో 'ఏ పి జె అబ్దుల్ కలాం ది పీపుల్స్ ప్రెసిడెంట్' అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈపోటీలలో టిజెపిఎస్, జెఎంజె, సెయింట్ ఆన్స్ మహిళా, ప్రభుత్వ మహిళా కాలేజిలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాల్గవ స్థానంలో నిలిచాయి. జెకెసి, సిమ్స్ కళాశాలలకు కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ కె.వి.బ్రహ్మం చేతులమీదుగా విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బివిహెచ్.కామేశ్వరశాస్త్రి, జిల్లా జాతీయ సేవాపథకం నోడల్ అధికారి డాక్టర్ జె.వి.సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-గుంటూరు

పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కాలేజిలో భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం జయంతి, ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన అబ్దుల్ కలాం విగ్రహాన్ని కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు, ముఖ్య అతిథి డాక్టర్ ఎస్‌విఆర్ రామప్రసాద్ ఆవిష్కరించారు. అనంతరం ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు వివిధ సాంస్కృతిక, క్రీడా, సహపాఠ్య కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఇటీవల పాన్ ఇండియా హ్యాకథాన్‌లో విజయం సాధించిన కళాశాల ఐటి విభాగం విద్యార్థులకు రూ.30వేలు నగదు బహుమతి అందచేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ డాక్టర్ జెట్టి అప్పారావు పాల్గొన్నారు.



కలాం విగ్రహావిష్కరణలో పాల్గొన్న పెరుమాళ్లు, రాంప్రసాద్



కార్మికులకు సబ్బులు పంపిణీచేస్తున్న సూపరింటెండెంట్

వ్యక్తిగత పరిశుభ్రత పాటించండి

ప్రజాశక్తి - దుగ్గిరాల

గ్రామ పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను కూడా తప్పకుండా పాటించాలని స్థానిక ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ వి.చంద్రమోహన్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం జరిగిన క్లాప్ మిత్ర పారిశుద్ధ కార్మికుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పారిశుద్ధ్యం పచ్చదనం వ్యక్తిగత పరిశుభ్రత అనే అంశంపై రిసోర్స్ పర్సన్ ఆర్ కిషోర్ కుమార్ అవగాహన కల్పించారు అనంతరం ఐటిసి పార్ట్నర్ సంస్థ ఫినిష్ సొసైటీ వారి వితరణలతో సబ్బులు, హ్యాండ్ వాష్ పంపిణీ చేశారు. స్థానిక పిహెచ్‌సి వైద్యులు శిబిరాన్ని ఏర్పాటు చేసి కార్మికులందరికీ టిటి వ్యాక్సిన్ ఇంజక్షన్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఐటిసి ప్రతినిధి యశ్వంత్ శ్రీనివాస్ ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది వైద్య సిబ్బంది బుజ్జి విమల సుకుమారి ప్రమీల రాణి సునీత తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం తాతిరెడ్డి

బీచ్ వాలీబాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి- తాడేపల్లి

ఈనెల 28వ తేదీ నుండి 31వ తేదీ వరకు బాపట్లలో జరిగే రాష్ట్రస్థాయి బీచ్ వాలీబాల్ పోటీలు జరగనున్నాయని (బాపట్ల బీచ్‌లో) తాడేపల్లి నెహ్రూ బొమ్మ సెంటర్ జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు భీమిరెడ్డి తాతిరెడ్డి తెలిపారు. ఈ పోటీలకు తమ పాఠశాల నుండి ఎం.అజయ్, పి. స్నేహిత ఎంపికైనట్లు చెప్పారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులను ప్రధానోపాధ్యాయులు అభినందించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు భీమిరెడ్డి తాతి రెడ్డి రాష్ట్రస్థాయి బీచ్ వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు.



వ్యాసరచన పోటీలలో పాల్గొన్న విద్యార్థులు

పౌష్టికాహారంపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి - తాడికొండ

పౌష్టికాహారంపై అవగాహన పెంచుకోవాలని నార్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నూతక్కి ప్రమీల తెలిపారు. పౌష్టికాహార మాసోత్సవాలలో భాగంగాం సూపోషిత్ భారత్ సాక్షర్ భారత్ కార్యక్రమంలో భాగంగా చిన్న పిల్లలకు ఇచ్చే ఆహారం పై గర్భవతులు, బాలింతలు కిశోర బాలికలకు బుధవారం తాడికొండలోని నార్స్ స్కూల్ నందు పౌష్టికాహారం ప్రాధాన్యత అనే అంశంపై కిరిశోర బాలలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నూతక్కి ప్రమీల మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అన్న పెద్దల మాట ప్రకారం ప్రతి తల్లి ఆమె కుటుంబ సభ్యులు పౌష్టికాహారంపై అవగాహన కలిగి ఉండాలని, ఎటువంటి ఆహారం తీసుకోవాలి, ఏ వయస్సువారు ఎంత ఆహారం తీసుకోవాలనే విషయంపై స్పష్టమైన అవగాహన అవసరమని తెలిపారు. మిశ్రమ ఆహారం, పాలు, పండ్లు, ఐరన్ ఉండే ఆహారం, మునగాకు, అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న ఆహారం గర్భవతులు, బాలింతలు తప్పకుండా తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.వి సుబ్బాయమ్మ, ఎం సరళ, బి.ప్రేమ కుమారి, వాసవి, గర్భవతులు, బాలింతలు, విద్యార్థులు పాల్గొన్నారు.

దీపావళి ఏర్పాట్లపై సబ్ కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి - తెనాలి



మాట్లాడుతున్న ఇంచార్జ్ సబ్ కలెక్టర్ లక్ష్మీ కుమారి

దీపావళి సందర్భంగా బాణాసంచా స్టాల్స్ ఏర్పాటు, స్టాల్స్ వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివిధ శాఖల అధికారులతో ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ ఎ.లక్ష్మీ కుమారి బుధవారం సమీక్ష నిర్వహించారు. పట్టణంలో స్టాల్స్ ఏర్పాటుకు వివిఎస్ ఆర్ అండ్ ఎన్‌వివిఆర్ కళాశాల ప్రాంగణాన్ని అధికారులు పరిశీలించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ లైసెన్సులకు దరఖాస్తు చేసుకున్న వ్యాపారులకు నిబంధనల మేరకు లైసెన్సులు మంజూరు చేయాలని, అదే సమయంలో లైసెన్సులు లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్టాల్స్ వద్ద పాటించాల్సిన నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ముఖ్యంగా అగ్ని ప్రమాదాలకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మొత్తంగా ప్రశాంత వాతావరణంలో ప్రజలు పండుగ జరుపుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో తెనాలి, కొల్లిపర, మంగళగిరి, తాడేపల్లి, పొన్నూరు, చేబ్రోలు, కాకుమాను మండలాల తహశీల్దార్లు, తెనాలి, పొన్నూరు మున్సిపల్ కమిషనర్లు, అగ్నిమాపక శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఈమనిలో సొసైటీ బ్రాంచ్ ఏర్పాటుకు సన్నాహాలు

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండల పరిధిలో అత్యధికంగా సాగుభూమి ఉన్న ఈమని గ్రామ కోఆపరేటివ్ సొసైటీలో గతంలో జరిగిన ఆర్థిక అవకతవకలు వలన సొసైటీ ద్వారా రైతులకు ఎటువంటి సేవలు అందడం లేదని రైతులు వాపోతున్నారు. దీనితో వ్యవసాయ శాఖ వారు రైతులకు సకాలంలో ఎరువులు అందించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకుంటున్నారు. దుగ్గిరాలలో ఉన్న గుంటూరు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (జిడిసిఎం ఎస్) బ్రాంచ్‌ను ఈ మనీ గ్రామంలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నట్లు మండల వ్యవసాయ అధికారి ఆర్.విజయబాబు బుధవారం తెలిపారు. రబీ సీజన్ నాటికి బ్రాంచిని ప్రారంభిస్తామని తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలో 22, 285 ఎకరాల మా గాని భూములు ఉండగా ఒక్క ఈమని గ్రామ పరిధిలోనే దాదాపు 8 వేల ఎకరాలు ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఖరీఫ్ కు రైతులకు ఇబ్బంది లేకుండా దుగ్గిరాలలోని ప్రైమరీ అగ్రికల్చరల్ కో-ఆపరేటివ్ సొసైటీ(పిఎస్ఈఎస్) ద్వారా 80 శాతం మరియు గ్రామంలో ఉన్న రైతు సేవ కేంద్రం, గ్రోమోర్ ద్వారా 20 శాతం ఎరువులు అందించినట్లు తెలిపారు. ఖరీఫ్ లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు సరఫరా చేశామని రబీలో కూడా రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన మేర సకాలంలో ఎరువులు సరఫరా చేస్తామన్నారు.



వివరాలు తెలుపుతున్న మండల వ్యవసాయ అధికారి విజయబాబు

32 మంది దివ్యాంగులకు కృత్రిమ చేతులు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కాలేజీలో రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో మంగళకరము అనే పేరుతో ఈనెల 14 నుండి 17 వరకు జరుగుతున్న నాలుగో విడత దివ్యాంగులకు కృత్రిమ చేతుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా రెండవ రోజైన బుధవారం 32 మంది దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ చేతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి అధ్యక్షులు ప్రగడ రాజశేఖర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా రోటరీ ఇంటర్నేషనల్ 3150 పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ జాస్తి రంగారావు హాజరై దివ్యాంగులకు కృత్రిమ చేతులను పంపిణీ చేశారు. అనంతరం రంగారావు మాట్లాడారు. దివ్యాంగులకు ఉచితంగా కఋత్రిమ చేతులు పంపిణీ చేయాలని రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి సంకల్పం ఎంతో అభినందనీయమన్నారు. దివ్యాంగులు వారి జీవితంలో ఎదుర్కొంటున్న చేదు అనుభవాలను వెల్లడిస్తుంటే మనసు చలించిపోతుందన్నారు. దివ్యాంగులకు కృత్రిమ చేతులు అమర్చిన తర్వాత వారి కళ్లల్లో ఆనందం చూస్తే ఎంతో సంతోషంగా ఉందన్నారు.



మాట్లాడుతున్న జాస్తి రంగారావు

ఈ కార్యక్రమంలో రోటరీ ఇంటర్నేషనల్ 3150 డిస్ట్రిక్ట్ చైర్, ఆర్టిఫిషియల్ లింబ్స్ డి.సాంబశివరావు, అవార్డు కమిటీ చైర్మన్ డాక్టర్ పి విష్ణు బాబు, రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి కార్యదర్శి పారేపల్లి నిరంజన్ గుప్తా, ట్రెజరర్ కె.వి.ఎన్. ప్రకాశరావు, ప్రాజెక్టు చైర్మన్ ఇసునూరి అనిల్ చక్రవర్తి, ఇమీడియట్ పాస్ట్ ప్రెసిడెంట్ గాజుల శ్రీనివాసరావు, రోటరీ ప్రతినిధులు రేవంత్ కుమార్, అందే మురళీ మోహనరావు, వడ్డమూడి శ్రీనివాసరావు, నూతలపాటి వెంకటేశ్వరరావు, చనుమోలు గోపాల్, కాపరౌతు సుందరయ్య, అవ్వారు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల చోరీపై సంతకాల సేకరించిన కాంగ్రెస్ నేతలు

ప్రజాశక్తి- తాడేపల్లి : కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ పిలుపు మేరకు ఏపీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నాయకత్వంలో జిల్లా అధ్యక్షులు చిలకా విజయ్ కుమార్ ఆదేశాలతో బుధవారం మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ఉండవల్లి సెంటర్లో కాంగ్రెస్ పార్టీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు దర్శనపు శామ్యూల్ ఆధ్వర్యంలో ఓటు చోరీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రజల నుండి సంతకాల సేకరణ చేపట్టారు. ముందుగా ఉండవల్లి సెంటర్లో ర్యాలీ నిర్వహించి అనంతరం ప్రతి షాప్‌కు వెళ్లి ఓట్ల చోరీపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ సంతకాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇంచార్జ్ షేక్ సలీం, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు దర్శనపు శామ్యూల్ పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కాపు సాధికారత చైర్మన్ రెమిడి శెట్టి హనుమంతరావు, మంగళగిరి మండల అధ్యక్షులు కొప్పాకల కష్ణ చౌదరి, తాడేపల్లి మండల అధ్యక్షులు షేక్ సుభాని, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు షేక్ మునీ, జిల్లా ఎస్సీ సెల్ వైస్ ప్రెసిడెంట్ సమర్పణ కుమార్, పాల్గొన్నారు.



తాడేపల్లిలో సంతకాల సేకరిస్తున్న షేక్ సలీం తదితరులు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ : ఎంటిఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం గ్రామంలో కాంగ్రెస్ మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ సలీం ఆధ్వర్యంలో ఓట్ల చోరీ పై అవగాహన కల్పిస్తూ, సంతకాల సేకరణ చేపట్టారు.



దీక్షల్లో నినాదాలు చేస్తున్న కార్మికులు

315వ రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లి

తమకు రావాల్సి బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు బుధవారం నాటికి 315 వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను కార్మిక నాయకులు కేఆదినారాయణ, తుపాకుల నాగేశ్వరావు, సి.హెచ్. పిచ్చయ్య, వై.సాంబశివరావు ప్రారంభించారు. దీక్షల్లో వై.రమాదేవి, ఈశారమ్మా, వి.రిబ్కా, టి.దుర్గాభవాని, వి.కాసమ్మ కూర్చున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్య ను పరిష్కరించి తన చిత్తశుద్ధి నిరూపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వై.సుబ్బారావు, హగ్గయ్య, శివకుమారి, డి.బేబమ్మ పాల్గొన్నారు.

శివాలయం హుండీల లెక్కింపు

ప్రజాశక్తి - పెదకాకాని

మండల కేంద్రమైన పెదకాకానిలోని శ్రీ మల్లేశ్వర స్వామి వారి హుండీల లెక్కింపు బుధవారం చేపట్టారు. ఈ లెక్కింపు కార్యక్రమానికి పర్యవేక్షణ అధికారిగా పి.సైదమ్మ బాయి వ్యవహరించారు.ఈ సందర్భంగా ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్ మాట్లాడుతూ గడచిన 77 రోజులకు గాను భక్తులు హుండీలలో వివిధ రూపాలలో వేసిన కానుకలు ఈరోజు లెక్కించడం జరిగిందని కానుకల హుండీ ద్వారా ఆదాయం రూ.36,36,324 రూపాయలు అన్నదానము హుండీ ద్వారా రూ.2,05,399 రూపాయలు ఆదాయం వచ్చింది అన్నారు.బంగారము 0.008.500 మి.గ్రా,వెండి 0.340.000 గ్రాములు,యు.యస్.ఎ. 24 డాలర్లు, ఆస్ట్రేలియా 70 డాలర్లు, కెనడా డాలర్లు 50, ఇంగ్లాండు 10 పాండ్లు ఆదాయము వచ్చినదని దేవస్థాన ఉపకమీషనరు గోగినేని లీలాకుమార్ తెలియజేశారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

ఘనంగా కలాం జయంతి

ప్రజాశక్తి-తాడేపల్లి

స్థానిక అంజిరెడ్డి భవన్‌లో బుధవారం మాజీ రాష్ట్రపతి, మిస్సైల్ మెన్ డాక్టర్ అబ్దుల్ కలాం జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైసిపి తాడేపల్లి పట్టణ అధ్యక్షులు, పొన్నూరు నియోజకవర్గ పరిశీలికులు బుర్రముక్కు వేణుగోపాలసోమి రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలు గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ కలలు కనాలని, ఆ కలలు సహకారం చేసుకుంటుంది కష్టపడి పని చేయాలని ని కోరారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు సమర్పించి, ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ వివిధ స్థాయిలోని అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా బాలిక దినోత్సవం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

8వ రాష్ట్రీయ పోషణ, అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు సిడిపిఓ పి.విజయ గౌరి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం పలుచోట్ల ఆటల పోటీలు నిర్వహించారు. మండలపరిధిలెపి కొలవరం గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సిడిపిఓ పి.విజయ గౌరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తూ, బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రం, ఆహారలోపాలు కారణంగా కలిగే నష్టాలను విజయ గౌరి వివరించారు. అలాగే ఉచిత హెల్ప్ లైన్ నంబర్లపై సూపర్‌వైజర్ యామిని కిషోరీ బాలికలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు జ్యోతి, నరసమ్మ, శ్రీవాణి, మణి, శిరోమణి, ప్రేమలత, సుజాత పాల్గొన్నారు.

గూగుల్‌తో నిరుద్యోగులకు సువర్ణ అవకాశం

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి



గూగుల్‌తో ఒప్పందం రాష్ట్ర చరిత్రలో సువర్ణ అధ్యాయమని రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వర రావు చెప్పారు. తన కార్యా లయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడి యా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గూగుల్ సంస్థను రాష్ట్రానికి తీసుకు రావడంలో సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృషి ఉందని, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలి పారు. ఇ గూగుల్ సంస్థ విశాఖపట్నంకి రావడం వలన చాలామంది నిరుద్యోగులకి ఉపాధి అవ కాశం కలుగుతుందన్నారు. తద్వారా రాష్ట్రాన్ని ఒక ఐటీ హబ్ రాజధాని గా మార్చ బోతుందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కోసం,యువత భవిష్యత్ కోసం గూగుల్ సంస్థ వచ్చిందని ప్రజలందరూ హర్షం వ్యక్తం చేస్తుంటే వైసిపి వారు ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు.



ధర్నా చేస్తున్న ఉద్యోగులు

మహదేవయ్యను విధుల్లోకి తీసుకోవాలి

చంద్రమౌళి నగర్ పోస్టాఫీసు వద్ద ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి-గుంటూరు

పోస్టల్ శాఖలోని అతిపెద్ద యూనియన్‌గా వున్న ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ జనరల్ సెక్రటరీ ఎస్ఎస్ మహదేవయ్యను 2023 సమ్మె చేయించారనే నెపంతో ఉద్యోగం నుండి తొలగించడాన్ని నిరసిస్తూ బుధవారం దేశవ్యాప్తంగా పోస్టల్ ఉద్యోగుల నిరసనలో భాగంగా స్థానిక చంద్రమౌళినగర్ పోస్ట్ ఆఫీస్ వద్ద ఉద్యోగులు ధర్నా, నిరసన ప్రదర్శన నిర్వహించారు. తొలగించిన మహదేవయ్యను వెంటనే విధులలోకి తీసుకోవాలని ముక్త కంఠంతో ఉద్యోగులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సమ్మె చేశారనే కారణంతో విధుల నుండి తొలగించటం అప్రజాస్వామిక అని అన్నారు. తక్షణమే మహదేవయ్యను విధుల్లోకి తీసుకోకుంటే ఉద్యమం చేస్తామన్నారు. ఈధర్నాల్లో ఎఐజిడిఎస్‌యు అఖిలభారత సహాయకార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, ఎఐపిఇయు సర్కిల్ సహాయ కార్యదర్శి ఎం.రామకృష్ణ, ఎఐజిడిఎస్‌యు డివిజనల్ కార్యదర్శి ఎన్.వి రాఘవేంద్ర, ప్రెసిడెంట్ కె.శేషిరెడ్డి, పి4 కార్యదర్శి సిహెచ్.రాము పాల్గొన్నారు. పెన్షనర్ల సంఘం నుంచి ఎన్.నాగేశ్వరరావు, వి.మోహనరావు, బి.రామారావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు పాల్గొని పోస్టల్ ఉద్యోగుల పోరాటానికి సంఘీభావం తెలిపారు.

రేపు విద్యుత్ కార్మికుల నిరసనలు

ప్రజాశక్తి-గుంటూరు

విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై అక్టోబర్ 15న జరగాల్సిన సమ్మె వాయిదా పడిన నేపథ్యంలో అక్టోబర్ 17న మధ్యాహ్నం 2 గంటలకు ఎస్.ఇ కార్యాలయం, డిఈ, ఎఈ ఆఫీసు వద్ద ధర్నా, బైఠాయింపు వంటి నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ జిల్లా చైర్మన్ దాసరి వెంకటేశ్వరరావు, వైస్‌చైర్మన్ జి.నాగరాజు, సిఐటియు జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. 17వ తేదీన మధ్యాహ్నం 3 గంటల నుండి విద్యుత్ సౌధాలో పవర్ జేఏసీతో చర్చలు జరుగుతాయని ప్రభుత్వం హామీలు ఇచ్చారంటున్న సమస్యలను ఎప్పటిలోగా పరిష్కరిస్తారనే నిర్దిష్టమైన స్పష్టత లేదని అన్నారు. ముఖ్యంగా కాంట్రాక్ట్ కార్మికుల్ని సంస్థలో విలీనం చేయాలనే అంశంపై యాజమాన్యం చేతులెత్తేసిందని, నేరుగా వేతనాలు చెల్లించటం లేదు కాని సంవత్సరానికి రూ. 192 కోట్లు లెక్క తేల్చిన యాజమాన్యం తగిన చర్యలు ఎందుకు తీసుకోవట్లేదని ప్రశ్నించారు. సంస్థకు నష్టంచేసే నిర్ణయాల వైపే ఎందుకు వెళ్తొందన్నారు. వన్ ఇండస్ట్రీ వన్ సర్వీస్ రెగ్యులేషన్స్ ఇంప్లిమెంట్ చేసి జేఎల్ఎం2లకు న్యాయం చేసేందుకు వచ్చిన ఇబ్బందులు ఏంటో చెప్పాలన్నారు. కార్మికులకు పెన్షన్ ఇవ్వడానికి చట్టాలు అడ్డు వస్తున్నాయని చెబుతూ ఎమ్మెల్యేలకు ఎంపీలకు ఇవ్వడానికి ఎందుకు అడ్డు కాదని ప్రశ్నించారు. విద్యుత్ సంస్థలో చర్చల పేరుతో, కమిటీల పేరుతో మసి పూసి మారేడు కాయ చేసే పద్ధతులు ఆపాలన్నారు. 17న జరిగే చర్చల పట్ల రాష్ట్రంలోని 27 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు, మరో 30 వేల మంది ఉద్యోగులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారని, అందుకే చర్చల్లో న్యాయమైన డిమాండ్స్ సాను కూలంగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.అలాగే పిఆర్‌సి బకాయిలు, షిఫ్ట్ ఆపరేటర్లు అందరికీ ఒకే వేతనం, బిల్ కలెక్టర్లు, మీటర్ రీడర్లు, స్టోర్ హమాలీలకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం, బిల్ కలెక్టర్లు, మీటర్ రీడర్స్, స్టోర్ హమాలీలకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం, డిస్కంల ప్రైవేటీకరణ విధానాలు ఆపడం వంటి అంశాలపైన స్పష్టమైన, రాతపూర్వకమైన ఒప్పందం లేకుండా సమ్మెను, పోరాటాన్ని ఉపసంహరించుకోకూడదని స్ట్రగుల్ కమిటీ నాయకులు అన్నారు.

నేడు లలితా హాస్పిటల్స్‌లో పక్షవాతం తర్వాత జీవితంపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక కొత్తపేటలోని లలితా హాస్పిటల్స్, గణేష్‌మహల్ పక్కన ఉన్న పివిఎస్ ప్రాంగణంలో నేడు పక్షవాతం తర్వాత జీవితాన్ని తిరిగి పొందటం ఎలా అనే అంశంపై 'స్ట్రోక్ సర్వైవర్స్ అండ్ కేర్ గివర్స్ మీట్' అనే అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ పి.విజయ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో డాక్టర్ విజయతోపాటు, డాక్టర్ యు.వీరమ్మ, డాక్టర్ రేష్మ, డాక్టర్ ఉషాకిరణ్ బెహరా, డాక్టర్ భార్గవ, డాక్టర్ అజ్మానాజ్, న్యూరోసర్జన్ డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు, డాక్టర్ సుజన, సైకాలజిస్టులు డాక్టర్ అజయ్, డాక్టర్ సరోజ తదితరులు పాల్గొని సందేహాలు నివృత్తి చేస్తారని తెలిపారు. కావున పక్షవాతం నుండి కోలుకుంటున్న వారు, వారి కుటుంబ సభ్యులు పాల్గొనాలని కోరారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణం చేపట్టాలి

జగనన్న లేఔట్లను పరిశీలించిన సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - పెదనందిపాడు

అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు డిమాండ్ చేశారు. బుధవారం నాగులపాడులో గత వైసిపి ప్రభుత్వం లబ్ధిదారులకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను సిపిఎం నాయకులతో కలిసి పరిశీలించారు. నాగులపాడులో 1.50 సెంట్లు చొప్పున 299 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారని, పెదనందిపాడు మండలంలో మొత్తం 2,026 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారని తెలిపారు. ఫేజ్2లో ఉందని మండలంలో ఏ ఒక్కరికి గత ప్రభుత్వం ఇళ్లు నిర్మించి ఇవ్వలేదన్నారు. అవి ప్రస్తుతం ముళ్ల చెట్లు, పిచ్చి కంప మొలిచి, ఏ ఇళ్ల స్థలం ఎవరిదో తెలుసుకోలేని పరిస్థితిలో ఉన్నాయన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న టిడిపి కూటమి ప్రభుత్వం పేదలకు గ్రామీణ ప్రాంతాలలో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాలలో 2 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇంటి నిర్మాణం చేపడతామని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చారని తెలిపారు. దానిలో భాగంగా గత ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలను 3 సెంట్లు కు పెంచి, ఇంకా ఇళ్ల స్థలాలు రాని అర్హులైన పేదలను గుర్తించి, వెంటనే అందరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు, సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు, సభ్యులు జంపని రామారావు, ముద్దన వెంకటేశ్వర్లు, కాపు వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



నాగలపాడు లో జగనన్న ఇంటి స్థలాలను పరిశీలిస్తున్న పాశం రామారావు తదితరులు

ఆర్‌విఆర్ అండ్ జెసిలో నేషనల్ ఇన్నోవేషన్ డే వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు

ఇండియాను ఇన్నోవేషన్ హబ్‌గా మార్చే దిశగా విద్యార్థులు సృజనాత్మక ఆవిష్కరణలకు నాంది పలకాలని, భారత విజ్ఞాన ప్రగతికి డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం మార్గదర్శకులని డిఆర్‌డిఓ శాస్త్రవేత్త, ఆర్‌సిఐ మాజీ డైరెక్టర్, అబ్దుల్ కలాం సహోద్యోగి డాక్టర్ సుబీర్‌కుమార్ చౌధరి అన్నారు. ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజీలో అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని ఆర్‌విఆర్‌జెసిసిఇ-ఎస్‌టిపి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ ఆవిష్కరణ దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తొలుత కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సుబీర్ కుమార్ చౌధరి భారతదేశ రక్షణ రంగాన్ని బలోపేతం చేసిన క్షిపణి, అణు కార్యక్రమాలలో జరిపిన ప్రయోగాలను, అంతరిక్ష పరిశోధనా రంగంలో తొలినాటి నుండి నేటి వరకు సాధించిన విజయాలను విద్యార్థులకు వివరించారు. కలాంతో తనకున్న అనుబంధాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. హీలెక్స్ సంస్థ కో-ఫౌండర్ , సీఈఓ డాక్టర్ పొలిమ్ చౌధరి మాట్లాడుతూ స్టార్టప్‌లు, నూతన ఆవిష్కరణలు భారత యువతకు ప్రపంచస్థాయి అవకాశాలు కల్పిస్తాయని తెలిపారు. ఆవిష్కరణలు దేశ ప్రగతికి మూలాధారాలని, యువ ఇంజనీర్లు సాంకేతికతను సమాజ శ్రేయస్సు దిశగా మలచాలని కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు విద్యతోపాటు పరిశోధన పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని, అబ్దుల్ కలాం గుంటూరు నగర పర్యటనకు వచ్చిన సందర్భంలో సాంకేతిక సృజనాత్మకతతో తమ కళాశాల విద్యార్థులు సాధించిన అనేక విజయాలపై అభినందించారని కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ సుబీర్‌కుమార్ చౌదరి

చలపతి కాలేజీలో ఘనంగా టెక్ ఫెస్ట్

ప్రజాశక్తి-గుంటూరు

లాంలోని చలపతి ఇంజినీరింగ్ కాలేజీలో కంప్యూటర్ సైన్స్ విభాగం, కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో జాతీయస్థాయి టెక్‌ఫెస్ట్ టెక్ నిర్వాణ్ బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తగా విజ్ఞాన్ యూనివర్సిటీ స్ట్రాటజీ డైరెక్టర్ ఎన్.చందన పాల్గొని ఇలాంటి ఫెస్టులు విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను బయటకు తీయటానికి ఉపయోగపడతాయని, మెరుగైన ఉపాధి అవకాశాలు పొందటానికి తోడ్పతాయని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ టెక్ ఫెస్ట్‌లో భాగంగా ప్రామ్ప్టబ్యాటిల్, టెక్నికల్ క్విజ్, పేపర్ ప్రజంటేషన్, పోస్టర్ ప్రజంటేషన్, తదితర పోటీలు నిర్వహించామని, 600 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. అనంతరం పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సిఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ ఎ.బాలాజీ, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



చందనను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేడు ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేడు కలెక్టరేట్ ప్రాంగణంలోని అసోసియేషన్ కార్యాలయం వద్ద ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు సిహెచ్.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ వైద్యశిబిరం కొనసాగుతుందన్నారు. మ్యాక్స్ విజన్ హాస్పిటల్స్ నుండి డాక్టర్ జి.శాలిని, కాన్వీ డెంటల్ హాస్పిటల్ నుండి డాక్టర్ జి.విజయచంద్ర, కొనాక్ డయాగ్నస్టిక్స్ నుండి టిడి సాయిబాబా పాల్గొని కన్ను, పన్ను, బిపి, షుగర్ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. వైద్యశిబిరాన్ని డిఆర్ఓ ఎన్ఎస్‌కె ఖాజావలి ప్రారంభిస్తారని తెలిపారు. కావున విశ్రాంత ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నకిలీ మద్యం నియంత్రణకు చర్యలు

క్యూఆర్ కోడ్‌తోనే విక్రయాలు

ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి



మద్యం బాటిల్ క్యూఆర్ కోడ్ ను పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్ కె. శ్రీనివాసులు

గుంటూరు పల్నాడు జిల్లాల పరిధిలో నకిలీ మద్యం సరఫరా కాకుండా అనే చర్యలు తీసు కుంటు న్నామని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ కె. శ్రీనివాసులు తెలిపారు. బుధవారం తన కార్యాయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మద్యం కొనుగోలుదారులు తీసుకునే బాటిల్ అసలు దాని లేదా అనే విషయాన్ని కనుగొనేందుకు ఒక యాప్ ను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. అలాగే జిల్లాలో బెల్ట్ షాపులు నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. బెల్ట్ షాపులో విక్రయించిన బాటిల్స్ ఏ దుకాణంలో సరఫరా చేసింది తెలుసుకొని దుకాణదారులపై చర్యలు తీసుకుంటామన్నారు. నకిలీ మద్యం నియంత్రణకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బందాలు, ఎన్ ఫోర్స్ మెంట్ బృందాలు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నాయన్నారు. మీడియా సమావేశంలో ఎక్సైజ్ అధికారులు వి .అరుణ కుమారి, సూరయ్యబాబు పాల్గొన్నారు.

ఆంధ్ర ప్రజలకు ముందుగానే దీపావళి
శిల్పారామం చైర్మన్ మంజులారెడ్డి

ప్రజాశక్తి - విజయపురిసౌత్ (రెంటచింతల)

విశాఖపట్టణంలో గూగుల్ సంస్థ రూ.87,500 కోట్ల పెట్టుబడితో దక్షిణ ఆసియా ఖండంలోనే అతిపెద్ద డేటా సెంటర్ క్లస్టర్ నిర్మించడానికి ముందుకు రావడం టెక్ విప్లవానికి నాంది అని శిల్పారామం చైర్మన్ చేర్రెడ్డి మంజులారెడ్డి అన్నారు. బుధవారం రెంటచింతలలో ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు సిటీ ఆఫ్ డెస్టినిగా ఉన్న విశాఖ నగరం ఇకపై ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), డిజిటల్ సిటీ రాజధానిగా మారనుందని చెప్పారు. రాష్ట్రంలో యువతకు ఐటీ(ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) రంగంలో 5లక్షల ఉద్యోగాలు లక్ష్యంగా లోకేష్ పనిచేస్తున్నారని చెప్పారు. గూగుల్ ఏర్పాటు కోసం మంత్రి లోకేష్ నిరంతరం శ్రమించారని, ఆంధ్ర ప్రదేశ్ ప్రపంచ పటంలో నిలబెట్టబోతున్నారని చెబుతూ ఆంధ్రా ప్రజలకు ముందుగానే దీపావళి వచ్చిందన్నారు. విలేకరుల సమావేశంలో సైదులు యాదవ్ నాళం పెదబాబు, కొత్త అంజి, కొత్త గోపాలరావు పాల్గొన్నారు.

ప్రపంచ హాస్పిస్ పాలియేటివ్ కేర్ దినోత్సవం

ప్రజాశక్తి - మంగళగిరి

ప్రపంచ హాస్పిస్, పాలియేటివ్ కేర్ దినోత్సవాన్ని బుధవారం మంగళగిరి ఎయిమ్స్‌లో నిర్వహించారు. అనస్థీషియాలజీ విభాగం పాలియేటివ్ కేర్ యూనిట్ ఈ ప్రాంతం అంతటా ఔట్ పేషెంట్, ఇన్‌పేషెంట్, హోమ్ ఆధారిత సేవల ద్వారా కారుణ్య, బహుళ విభాగ సంరక్షణను విస్తరిస్తూనే ఉందని ఎయిమ్స్ మంగళగిరి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అహంతెం శాంతాసింగ్ అన్నారు. అనస్థీషియాలజీ విభాగాధిపతి డాక్టర్ హెచ్.ఎం. కృష్ణ మార్గదర్శకత్వంలో పాలియేటివ్ కేర్ సేవలు డాక్టర్ సమర్జిత్ డే, డాక్టర్ సునీత్‌కుమార్‌గుప్తా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ పాలియేటివ్ కేర్ జీవిత పరిమితి లేదా దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడుతున్న రోగుల నొప్పిని తగ్గించడం, శారీరక, మానసిక, సామాజిక, ఆధ్యాత్మిక అవసరాలను తీర్చడం లక్ష్యంగా పెట్టుకున్న సమగ్ర, రోగి-కేంద్రీకత విధానమని తెలిపారు. ప్రస్తుతం, దీర్ఘకాలిక, అధునాతన వ్యాధులతో బాధపడుతున్న 300 మందికి పైగా రోగులు ఎయిమ్స్ మంగళగిరి ఔట్రీచ్ పాలియేటివ్ కేర్ సర్వీసెస్ కింద నమోదు చేసుకున్నారనీ, వారు నిరంతర వైద్య, నర్సింగ్. భావోద్వేగ మద్దతును పొందుతున్నారని అన్నారు.

19న ఉచిత మెగా మెడికల్ క్యాంపు

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకష్ణదేవరాయలు, మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానంద రెడ్డిల సహకారం, ఆశీస్సులతో గుంటూరు లక్ష్మణ్ ఆర్థో కేర్ ఆధ్వర్యంలో ఉచిత మెగా మెడికల్ క్యాంపు జరగనుంది. ఎముకల ఆపరేషన్, ఇన్ఫెక్షన్ లేదా ఫెయిల్ అయిన వారికి, పుట్టుకతో లేదా యాక్సిడెంట్ వలన కాలు, చెయ్యి పొట్టి లేదా వంపు కలిగిన వారికి ఉచిత పరీక్షలు నిర్వహించనున్నారు. ఈనెల19న పట్టణంలోని మానుకొండ కళ్యాణ మండపంలో జరిగే మెడికల్ క్యాంపులో మందులు, ఎక్సరే రాయితీ ఇస్తారు. మరింత సమాచారం కొరకు 6302556406, 7799384778, 0863-7961355 సంప్రదించాలని నిర్వాహుకులు సూచించారు.

భావన డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణంలోని వివిఆర్ ఫంక్షన్ హాలులో బుధవారం భావన డిగ్రీ (విక్టరీ డిగ్రీ) కళాశాల ఫ్రెషర్స్ డే నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఒద్దుల సుబ్బారెడ్డి, డైరెక్టర్ మైనీడి శ్రీనివాసరావు, భావన ఐఐటీ, నీట్ అకాడమీ డైరెక్టర్ జి. రామచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ పి. వేణుగోపాల్ హాజరై మాట్లాడారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. విద్య, క్రీడలలో రాణించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్లోబల్ హ్యాండ్ వాష్ డే

ప్రజాశక్తి - వినుకొండ

ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవి. ఆంజనేయులు, కలెక్టర్ కృతిక శుక్ల ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ దస్తగిరి సూచనలతో మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో గ్లోబల్ హ్యాండ్ వాష్ డే సందర్భంగా పట్టణంలోని గీతాంజలి స్కూల్‌లో బుధవారం హ్యాండ్ వాష్, స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ దీవస్ నవంబర్ నెల థీమ్ అయిన వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత, సామాజిక పరిశుభ్రత, బహిరంగ మలమూత్ర విసర్జన నివారణ గురించి విద్యార్థుల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శానిటరీ ఇన్స్పెక్టర్ ఇస్మాయిల్ మాట్లాడుతూ మనం ఆరోగ్యంగా ఉండాలంటే ముందు మన చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఉంది. చేతులు శుభ్రంగా లేకపోతే.. దానికి ఉండే క్రిములు, బ్యాక్టీరియా, వైరస్‌లు మనం తీసుకునే ఆహారం ద్వారా మన శరీరంలోకి వెళ్తాయి. దీని కారణంగా తీవ్ర ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. చేతులు శుభ్రం చేసుకోవడంలో ప్రాముఖ్యతను చెప్పడానికి.. ఈరోజు 'గ్లోబల్ హ్యాండ్ వాష్ డే'ను నిర్వహించామన్నారు. ఈ హ్యాండ్ వాష్ అలవాటుతో 80శాతం రోగాలను అరికట్టవచ్చని తెలిపారు. గీతాంజలి స్కూల్ డైరెక్టర్ కిషోర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, శానిటరీ సెక్రెటరీలు , మేస్త్రీలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రొంపిచర్ల మండలం వి.రెడ్డిపాలెం గ్రామంలోని పియం శ్రీ ఎపి మోడల్ స్కూల్‌లో గ్లోబల్‌హ్యాండ్ వాషింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు ప్లకార్డులు చేబూని నినాదాలు చేస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రవినాయక్ మాట్లాడుతూ భోజనానికి ముందు, అనంతరం శుభ్రంగా చేతులు కడుక్కోవాలన్నారు. మధ్యాహ్నం భోజన సమయంలో విద్యార్థులచే హ్యాండ్ వాషింగ్ చేయించి వారికి అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పొన్నూరు

మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబు ఆధ్వర్యంలో ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం వేడుకల నిర్వహించారు. కమిషనర్ రమేష్ బాబు మాట్లాడుతూ అంటువ్యాధులు ప్రబలకుండా చేతులను ఎప్పటికప్పుడు (మలమూత్ర విసర్జన తరువాత, భోజనానికి, వంట, భోజన వడ్డనకు ముందు తరువాత, పిల్లలు ఆటలాడిన తరువాత) చేతులు సబ్బుతో కడుకోవ్వటం అలవాటుగా మార్చుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ , మెప్మా స్వయం సహాయక సంఘ మహిళలు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి యోగా పోటీల్లో తృతీయ స్థానం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలంలోని కోటప్పకొండ రోడ్డులోని నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన సిహెచ్. మారుతి శ్రీనివాసరాజు జాతీయ స్థాయి యోగాసనా పోటీలలో తృతీయ స్థానం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్ణాటక రాష్ట్రం మైసూరులో ఈనెల 9 నుండి 12 వరకు యోగాసనా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన 50వ సీనియర్ నేషనల్ యోగ స్పోర్ట్స్ ఛాంపియన్షిప్ - 2025-26లో ఫ్రీఫ్లో, ఆర్టిస్టిక్ పెయిర్ విభాగాల్లో పోటీలు నిర్వహించారని తెలిపారు. ఈ సందర్బంగా కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు,



శ్రీనివాసరాజును సత్కరిస్తున్న మిట్టపల్లి కోటేశ్వరరావు

వైస్ చైర్మన్ ఎంఎస్. చక్రవర్తి, సెక్రటరీ మిట్టపల్లి రమేష్ బాబు, విభాగాధిపతి డాక్టర్ బి.ఝాన్సీ వజ్రం, వ్యాయామ ఉపాధ్యాయులు ఎల్.కృష్ణారెడ్డి, ఎన్. ఆంజనేయులు, పి. విజయకుమార్ మారుతి శ్రీనివాసరాజును అభినందించారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన

ప్రజాశక్తి - పెదనందిపాడు

సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బి.ఆర్ గవాయిపైన దాడి అనాగరికమైన చర్య అని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మున్నంగి నాగరాజు మాదిగ ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడికి నిరసనగా ఈనెల 17న మండల కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించాలని పిలుపునిచ్చారు. బుధవారం పెదనందిపాడు లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయి దళితుడు కావడం వల్లే ఈ దాడి జరిగిందని పేర్కొన్నారు. ఈ దాడి చేసిన వారి మీద చట్టపరమైన చర్యలు తక్షణమే తీసుకోవాలి అని డిమాండ్ చేశారు.జరిగిన దాడి మీద చీఫ్ జస్టిస్ గవాయి గారి స్పందన అత్యంత హుందాతనంతో ఉందన్నారు. దళితులు ఉన్నత స్థానాల్లో కూర్చోవడం కొంతమందికి గిట్టడం లేదని, అందుకే ఇలా దాడికి పాల్పడుతున్నారన్నారు. ఇది కేవలం చీఫ్ జస్టిస్ పై దాడి మాత్రమే కాదు దేశ న్యాయవ్యవస్థ మీద ప్రజాస్వామిక స్ఫూర్తి మీద అన్నిటికన్నా ప్రధానంగా రాజ్యాంగ మీద జరిగిన దాడిగా అభివర్ణించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు వేమూరి సుదీర్ మాదిగ,ఎం ఎస్ పి రాష్ట్ర నాయకులు కూచిపూడి సత్యం మాదిగ ఎంఎస్‌పి జిల్లా నాయకులు హదయ రాజు మాదిగ,ప్రత్తిపాడు, పెదనందిపాడు మండల ఇంచార్జి దున్న సాంబయ్య మాదిగ, జిల్లా ఉపాధ్యక్షులు కారుమూరి అంకయ్య మాదిగ,మండల అధ్యక్షులు వరగాని కైసరు మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.



శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ హబీబుల్లా ఖాన్

కేఎల్‌యులో ఉచిత దంత వైద్య శిబిరం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీలోని ఉమెన్ డెవలప్మెంట్‌సెల్, యూత్ రెడ్ క్రాస్, కాలేజీ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించినట్లు డీన్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్ తెలిపారు. విజయవాడకు చెందిన భరణి డెంటల్ కేర్ వైద్యులు డాక్టర్ సిఎల్ వి కిరణ్ కుమార్, డాక్టర్ నికిత కామటి వైద్య సేవలు అందించారు. యూనివర్సిటీలోని అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, భవన నిర్మాణ కార్మికులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు అందజేసినట్లు చెప్పారు. ముందుగా వైద్య శిబిరాన్ని డీన్ స్టూడెంట్ అఫైర్స్ సలహాదారులు డాక్టర్ హబీబుల్లా ఖాన్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీలోని అధ్యాపకులు సిబ్బంది కార్మికుల సంక్షేమం కోసం నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో అసోసియేట్ డీన్, ఉమెన్ డెవలప్మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ కె రూతు రమ్య, యూత్ రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్. సుప్రియ, లిబరల్ ఆర్ట్స్ ప్రొఫెసర్ ఇంచార్జ్ డాక్టర్ ఆర్ సుధాకరరాజు పర్యవేక్షించగా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి పార్థసారథి వర్మ, ప్రో వైస్ ఛాన్సర్ డాక్టర్ ఏ వి ఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్ వెంకట్రామ్, డాక్టర్ కె రాజశేఖర్ రావు, రిజిస్ట్రార్ డాక్టర్ కే సుబ్బారావు, ప్రిన్సిపల్ డాక్టర్ వి రాజేష్ , ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ చక్రవర్తి పాల్గొన్నారు.

విక్రయాలకు అనుమతులు తప్పనిసరి
జిల్లా అగ్నిమాపక అధికారి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

బాణసంచా పేలుళ్ళు, ప్రమాదాలు జరగకుండా బాణసంచా నిల్వ ఉంచే గోదాములు, విక్రయించే లైసెన్సు కలిగిన దుకాణాలు, తాత్కాలిక బాణసంచా విక్రయ దుకాణాల వద్ద వ్యాపారులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీధర్ సూచించారు. బాణ సంచా విక్రయించేందుకు విక్రయదారులు తప్పనిసరిగా అనుమతులు పొందాలన్నారు. తాత్కాలికంగా బాణసంచా విక్రయాలు చేపట్టే వ్యాపారులు తమ తాత్కాలిక షాపులను నివాస ప్రాంతాలకు, ఆసుపత్రులకు దూరంగా, పట్టణ, గ్రామ శివార్లలోని బహిరంగ ప్రదేశాల్లో మాత్రమే షాపులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతి దుకాణానికి నిర్దిష్ట దూరం ఉండాలని, బాణసంచా అనుమతులు ఉన్న దుకాణాల నుండి తాత్కాలిక లైసెన్సులు పొందిన విక్రయదారులు కొనుగోళ్ళు చేయాలన్నారు. దుకాణాల వద్ద ప్రమాదాల నివారణకు ఇసుక బస్తాలు, నీరు అందుబాటులో ఉంచుకోవాలని ప్రమాదాల నియంత్రణకు చేపట్టాల్సిన అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అగ్ని ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న వస్తువులు, దగ్గరలో లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జాగ్రత్తలు, పాటించాల్సిన నిబంధనలు, హెచ్చరికలతో కూడిన బోర్డులను, ఫ్లెక్సీలను దుకాణాల వద్ద ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలు ప్రయాణించే వాహనాలలో బాణసంచా రవాణ చేయకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి - చేబ్రోలు

వసతి గృహ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు వార్డెన్ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మైలా వెంకటరామరాజు, ప్రధాన కార్యదర్శి అనంత లక్ష్మీనారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ వసతి గృహవిద్యార్థులకు ప్రత్యేక వసతులు ఏర్పాటుపై మంత్రి నారా లోకేష్ ప్రత్యేక దష్టి ఉంచారని ప్రభుత్వం నుండి అందే ప్రతి సంక్షేమాన్ని విద్యార్థులు సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వార్డెన్ ప్రసాదు విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత హోమియో మందుల పంపిణీ

ప్రజాశక్తి - పొన్నూరు

వాసవి క్లబ్ వారి ఆధ్వర్యంలో నేతాజీ నగర్ మున్సిపల్ స్కూలు విద్యార్థులు వ్యాధుల బారిన పడకుండా ఉచిత హోమియో మందులను బుధవారం పంపిణీ చేశారు. వాసవీ క్లబ్ పొన్నూరు రీజనల్ చైర్మన్ భవిరిశెట్టి శ్రీదేవి ఫ్రెండ్లీ విసిట్ సందర్భంలో నేతాజీ నగర్ మున్సిపల్ హైస్కూల్‌లో సిమెంట్ బెంచ్ ఆవిష్కరించిన అనంతరం 100 చిన్నారులకు హోమియోపతి మందులు పంపిణీ చేశారు. శ్రీదేవి మాట్లాడుతూ వాసవీ క్లబ్ పొన్నూరు వారు చేస్తున్న సేవలు అమోఘం అన్నారు. కార్యక్రమంలో రీజనల్ సెక్రెటరీ అరుణ కుమారి, సిల్వర్ స్టార్, ఆకి కిషోర్, తుమ్మలపెంట భావనారాయణ, గోద్రెజ్ శివ, పాఠశాల ఉపాధ్యాయులు, అధ్యక్షులు కొత్తూరి వంశీకృష్ణ సెక్రటరీ పల్లపోతుగణేష్ కుమార్, ట్రెజరర్ పోలిశెట్టి విజయకుమార్ పాల్గొన్నారు.

సిఆర్‌పిపై అవగాహన

ప్రజాశక్తి - పొన్నూరు

పొన్నూరు మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ప్రజల భద్రత అత్యవసర సేవలకు ప్రాధాన్యతనిస్తూ కార్డియోపల్మనరీ రిససిటేషన్ శిక్షణ శిబిరం నిర్వహించారు. డాక్టర్ వంశీ మాట్లాడుతూ గుండె ఆగిపోయిన సందర్భాలలో సిఆర్‌పి ఎంత కీలకమో వివరించారు. సి ఆర్‌పి చేయటం వలన ప్రాణాలను కాపాడవచ్చని డెమో ద్వారా వివరించారు. మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబు, వైద్య సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గజిటెడ్ హోదా కల్పించండి

ప్రజాశక్తి - విజయపురిసౌత్ (రెంటచింతల)

మండలంలోని వివిధ గ్రామాల్లో పని చేస్తున్న మండల పరిషత్ ఆదర్శ పాఠశాలల హెచ్‌ఎంలకు గజిటెడ్ హోదా కల్పించాలని ఉపాధ్యాయ సంఘాల నేతలు కోరారు. మారుమూలన వున్న గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు గజిటెడ్ సంతకం కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఈ విషయంలో చొరవ తీసుకోవాలని కోరారు.

క్రీడలలో మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - క్రోసూరు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఖోఖో అండర్-19 పోటీల్లో క్రోసూరు మోడల్ స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థి ఎం.సుదీర్, పదో తరగతి విద్యార్థి డి.శివగణేష్ రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎం.మేరీ సూజన్ తెలిపారు. ప్రిన్సిపల్‌ఉపాధ్యాయులు అభినందించారు.

ఎరువుల అమ్మకాల పరిశీలన

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలంలోని చాగంటివారిపాలెం రైతుసేవ కేంద్రాన్ని పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి ఎం.జగ్గారావు బుధవారం సందర్శించారు. ఎరువుల అమ్మకాలను, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్‌లో నమోదు ప్రక్రియను పరిశీలించారు. జిల్లాలో యూరియా కొరత లేదని, పంటలకు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని రైతులతో చెప్పారు. ఎరువుల అమ్మకాల రికార్డును ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఏడీఏ రవిబాబు, వ్యవసాయ విస్తరణాధికారి శేషుబాబు, విలేజ్ అగ్రి అసిస్టెంట్ పావని, ఎంపిఇఒ భరత్ పాల్గొన్నారు.